ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024 | 5







దేదీప్యమానమై..

రాజమహేంద్రి పుష్కర ఘాట్‌లో పోలి స్వర్గం దీపాలను వదులుతున్న భక్తులు.. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో పుణ్య స్నానాలు.. దీపార్చనలు



గోదావరిలో పోలి స్వర్గం దీపాల వరుసలు

ఘాట్లలో పుణ్యస్నానాలు.. కార్తీకానికి వీడ్కోలు

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసానికి భక్తులు వీడ్కోలు పలికారు. అలాగే పోలి పాడ్యమి సందర్భంగా దీపాలను గోదావరి నదిలో వదిలారు. సోమవారం తెల్లవారుజాము నుంచే రాజమహేంద్రవరం గోదావరి ఘాట్‌లు భక్తులతో సందడిగా మారాయి. పుష్కరాల ఘాట్, కోటిలింగాల ఘాట్, టీటీడీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్‌లలో పుణ్య స్నానాలు చేసి దీపాలు నదిలో వదిలారు. పురోహితులకు దీప, స్వయంపాక, శాలిగ్రామ దానాలు చేశారు. అనంతరం మహాశివుడను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అలాగే కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో భక్తులు గోదావరి పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు అరటిడొప్పలలో నేతి దీపాలను వెలిగించి పోలి స్వర్గం దీపాలను నదిలో వదిలారు. ప్రధాన స్నానఘట్టంలో శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. క్షేత్రంలో రావిచెట్టు వద్ద నాగశిలలకు పాలు, నదీ జలాలతో అభిషేకించారు. ప్రధాన స్నానఘట్టం, తులసి, రావిచెట్ల వద్ద, సుందరేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద కార్తీక దీపాలను వెలిగించారు.



ఉచిత ఇసుకకు తూట్లు

ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు. రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి వచ్చే రూ. వందల కోట్ల ఆదాయాన్ని కాదనుకుని, ఎన్నికల ముందు ఇచ్చి హామీ మేరకు ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. వీటికి జీఎస్టీలు, సీనరేజ కూడా రద్దు చేశారు. బోట్స్‌మన్ సొసైటీల వద్ద టన్నుకు రూ.195, ఓపెన్ రీచ్‌ల వద్ద టన్నుకు రూ.140వరకూ నిర్ణయించారు. కానీ ఎక్కడా ఈవిధంగా వసూలు చేయడంలేదు. ప్రతీ చోట టన్నుకు రూ. 450 వరకూ వసూలు చేస్తున్నారు. 20 టన్నుల లారీకి ర్యాంపులో సుమారు 4 వేల 600వరకూ వసూలు చేయవలసింది, ఏకంగా రూ.11వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అధికారులు ఎంత కట్టుదిట్ట చర్యలు చేపట్టినా, రాజకీయ నేతల కనుసన్నలలో ఇసుక మాఫియా విజృంభిస్తోంది.

- బోట్స్‌మన్ సొసైటీల పేరిట దోపిడీ » లారీకి రూ.6 వేల వరకూ వసూలు
- ర్యాంపులో 20 టన్నుల లారీకి రూ.11 వేలు » కాకినాడకు లారీకి రూ.28 వేలపైనే
- పేరుకే బోట్స్‌మన్ సొసైటీలు » ఇతర రాష్ట్రాల కార్మికులతో పని » కొన్ని సొసైటీలు బోగస్
- వైసీపీకి చెందిన ఆర్కే చేతిలో బోట్స్‌మన్ సొసైటీలు » నెలాఖరితో అనుమతులకు చెల్లు
- రాత్రి వేళల్లో డ్రెడ్జింగ్ » కడియపులంక ఓపెన్ ర్యాంపులో నిలువుదోపిడీ
- అఖండ గోదావరిలో డ్రెడ్జింగ్‌కు టెండర్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండగోదావరిలో నీటిలో దిగి ఇసుక తీసి, ఒడ్డుకు చేర్చి ఉపాధి పొందడం కోసం కూలీలు, పేదలతో పూర్వం బోట్స్‌మన్ సొసైటీలు ఉండేవి. ఇవాళ సామాన్యుల చేతుల నుంచి బోట్స్ జారీపోయాయి. పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈసారి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు వైపు మొత్తం 275 సొసైటీలు రిజిస్టర్ అయ్యాయి. అందులో అధికారులు 140 బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతి ఇచ్చారు. కానీ అందులో పనిచేసేవి 100 కూడా లేవు. చాలా వరకూ బోగస్ సొసైటీలే ఉన్నాయని ఇరిగేషన్ అధికారులే చెబుతున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఇటువంటి బోగస్ సొసైటీలను గుర్తించి నివేదిక ఇవ్వాలని, వాటిని రద్దు చేయాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రానికి ఇరిగేషన్ అధికారులు బోగస్ సొసైటీల పేరిట నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం. రాజకీయ నేతల ఒత్తిడి వల్ల అనేక బోగస్ సొసైటీలకు అధికారులే అనుమతివ్వడం గమనార్హం. పైగా ర్యాంపులలో చోటు కూడా లేకపోయినప్పటికీ, ఎక్కువ సొసైటీలకు అనుమతి ఇవ్వడం వల్ల అసలు పడవలు లేనివాళ్లు కూడా సొసైటీల పేరిట అనుమతులు పొందారు. కొన్ని సొసైటీలు పనిచేయకపోయినా, వాటి పేర కూడా ఇసుక తీసినట్టు నమోదు చేస్తున్నట్టు సమాచారం. రాత్రి వేళల్లో డ్రెడ్జింగ్ చేసి అందరూ పంచుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని గాయత్రీ, కోటిలింగాల ర్యాంపులలో రాత్రుల వేళ్లలో డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఎలాంటి నిబంధనలూ వీరు పాటించడంలేదు. ఇష్టానుసారం ఇసుక దోపిడీ చేస్తున్నారు.

● కొవ్వూరులో ఘరానా దోపిడీ

కొవ్వూరు నుంచి వాడపల్లి వరకూ ర్యాంపులలో వందల సంఖ్యలో పడవలు ఉంటాయి. సుమారు ఇక్కడ 40సొసైటీలకు పైగా అనుమతి పొందినప్పటికీ, పదికంటే తక్కువ సొసైటీల పేరనే ఇక్కడ వ్యవహారం నడుస్తోంది. అసలు సొసైటీ అంటే ఉపాధి కోసం పనిచేసుకునే కార్మికులకు పని కల్పించడం కోసం ఏర్పడింది. ఇక్కడ ఒక్క కార్మికుడు కూడా ఉండరు. అధికార వర్గాలకు చెందిన కొందరు నేతలు ఇక్కడ దందా చేస్తుంటారు. ఏ పార్టీ ఉన్నా వీరి దందా ఆగదు. ఉచిత ఇసుక విధానానికి ఇక్కడ దారుణంగా తూట్లు పొడిచారు. ఇక్కడ కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. లారీకి అదనంగా రూ.6 వేల వరకూ వసూలు చేస్తున్నారు. రాత్రుల వేళ రోడ్డు కం రైలు బ్రిడ్జి మీద నుంచి కూడా రవాణా చేస్తున్నారు. ఇటీవల భారీ వాహనాలు వెళ్లకుండా ఇక్కడ గడ్డర్లు వేస్తే ఈ ఇసుక మాఫియా వాటిని ధ్వంసంచేసింది. విజ్జేశ్వరం నుంచి బ్యారేజి మీదుగా రావులపాలెం వైపు కూడా ఇసుక లారీలు వెళుతున్నాయి. బ్యారేజీ మీద నిషేధం ఉన్నా ఆపేవాళ్లే లేరు. కొవ్వూరు నుంచి కాకినాడకు 20 టన్నుల లారీకి రూ.28వేల వరకూ వసూలు చేస్తున్నారు.

● కడియపులంక ర్యాంపులో దోపిడీ

కడియపులంక ఇసుక ర్యాంపులో నిబంధనలు పాటించడం లేదు. నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇక్కడ మొదటి టెండరుదారుడు అనర్హుడు కావడంతో రెండో టెండరుదారుకి అధికారులు అవకాశం ఇచ్చారు. దీనితో కోనసీమకు చెందిన ఒక వ్యక్తి పేరట రాత్రీ పగళ్లు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. మొదటి టెండరుదారు కోర్టుకెళ్లి స్టే తెచ్చినా సరే ఇక్కడ దోపిడీ ఆగడం లేదు. అధికారులూ పట్టించుకోవడం లేదు.

● ఎవరీ ఆర్కే..

ఇటీవల ఇసుక ర్యాంపులలో ఆర్కే అనే మాట బాగా వినిపిస్తోంది. మొత్తం బోట్స్‌మన్ సొసైటీలన్నీ అతడే మెయింటెనెన్స్ చేస్తున్నట్టు అందరి నోట వినిపిస్తోంది. ఇంతవరకూ ఈ ఆర్కే అనే వ్యక్తి ఇతర జిల్లాలకు చెందిన ఇసుక వ్యాపారి. ఒక కేసులో జైలు రిమాండ్‌లో కూడా ఉన్నారు. గత వైసీపీ ఆధ్వర్యంలో బోట్స్‌మన్ సొసైటీల పేరిట యథేచ్ఛగా ఇసుక డ్రెడ్జింగ్ చేసి వైసీపీ అధిష్టానానికి నెలకు రూ.కోట్లు కప్పం కట్టి, తానూ భారీగానే దోచుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అటువంటి వ్యక్తి కూటమి ప్రభుత్వంలో కూడా ఇసుక పెత్తనం చెలాయిస్తున్నాడు. మొత్తం అతని చేతిలోనే ఇసుక వ్యాపారం జరుగుతుండడం గమనార్హం. డబ్బు వ్యవహారాలు కూడా అతని చేతుల మీదుగానే సాగుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇసుక తీత తక్కువ వస్తున్నట్టు కూడా మతలబు మొదలెట్టారు. అసలు లెక్కల్లోకి రాకుండానే ఇసుక విక్రయాలు సాగిస్తున్నారు. ఈ బోట్స్‌మన్ సొసైటీ ర్యాంపుల పర్యవేక్షించవలసిన ఇరిగేషన్ అధికార్లకు కూడా ఇక్కడి లెక్కలు తెలియడం లేదనడం గమనార్హం. అంటే ఎంత ఇసుక దొంగచాటుగా వెళ్లిపోతుందో అర్థం చేసుకోవచ్చు. పైగా ఇసుక తీత తక్కువైందని ప్రచారం చేస్తున్నారు. కాగా బోట్స్‌మన్ సొసైటీలకు ఈనెలాఖరితో అనుమతులు ముగుస్తున్నాయి. దీంతో దోపిడీ మరింత పెరిగింది. రాత్రీపగలూ డ్రెడ్జింగ్ చేసి ఇసుక దోపిడీ చేస్తున్నారు. రూ.కోట్లు గడిస్తున్నారు.

● త్వరలో డ్రెడ్జింగ్‌కు అనుమతి

గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందిన రాఘవా కన్‌స్ట్రక్షన్ అసలు ఇసుక తీయకుండానే బిల్లులు కోసం ప్రయత్నం చేస్తున్న సంగతి తెలిసిందే. గతంలో ఆర్కే అనే వ్యక్తి వైసీపీ పెద్దల అండదండలతో చేసిన ఇసుక అక్రమ డ్రెడ్జింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఇక బోట్స్‌మన్ గడువు ముగియనుండడంతోపాటు రాఘవా కన్‌స్ట్రక్షన్‌కు ఇచ్చిన గడువు కూడా ముగియనుంది. దీంతో కొత్త ఏజన్సీతో మినీ మెకనైజ్డ్ బోట్లతో డ్రెడ్జింగ్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మేరకు టెండర్ల ప్రక్రియకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో గోదావరిలో వచ్చే నెల నుంచి డ్రెడ్జింగ్ మొదలు కావచ్చు. ఏ విధానంలో ఇసుక తీసినా, ఉచిత విధానానికి అనుకూలంగా లేకపోతే చెడ్డపేరు వస్తుంది. సీతానగరం మండలంలో వంగలపూడి ట్రాక్టర్లతో ఉచిత ఇసుకను తరలిస్తున్నారు. ఇక్కడ కూడా అవసరం ఉన్నవాళ్లు.. లేని వాళ్లూ, వ్యాపారులు కూడా ఇసుకను తరలించుకుపోతుండడం గమనార్హం.



బొమ్మూరులోని కలెక్టరేట్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

శాశ్వత పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులంతా పనిచేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పీజీఆర్ఎస్ నిర్వహణపై సమస్యల పరిష్కారాల రిపోర్టుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారంవారం సమీక్షిస్తున్నారని చెప్పారు. లాండ్ ఆర్డర్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ఎక్కువ అర్జీలు రావడం జరుగుతోందన్నారు. అర్జీదారులకు శాశ్వత పరిష్కారాలు చూపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రజల నుంచి 126 అర్జీలు స్వీకరించారు. వాటిలో ఆన్‌లైన్‌లో 125 ఆఫ్‌లైన్‌లో ఒకటి వచ్చాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

5న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు..

ఈనెల 5న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలపై అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు చాలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అలాగే డిసెంబర్ 5న జరిగే అన్ని గ్రామాల నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 23 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. 23 అర్జీలను స్వీకరించి అధికారులకు పంపించారు.



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పర్యాటకంగా కడియం అభివృద్ధి : కలెక్టర్

కడియం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కడియం నర్సరీలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేలా నర్సరీ ప్రతినిధులతో సంప్రదించడం, కార్యరూపం దాల్చడంపై సమన్వయ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో పర్యాటక, ఉద్యానవన, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ కడియం నర్సరీలను వివిధ రకాల అంశాలతో కూడిన రీతిలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. బోటింగ్, స్టాల్స్, జిప్ లాగ్, అడ్వంచర్ స్పోర్ట్స్ తదితర అంశాల సమ్మేళనంతో ఈ ప్రాంతం అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. టూరిజం అభివృద్ధి వల్ల ఈ ప్రాంతానికి మంచి గుర్తింపుతోపాటు ఇక్కడి వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ తెలిపారు. స్టాల్స్ ప్రతిపాదన కోసం లేఅవుట్ సిద్ధం చేసి, కేటాయింపులపై ప్రణాళిక అందజేయాలని ఆదేశించారు. సౌందర్య వాస్తు శిల్పి ఎక్కువమంది సందర్శించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. కడియం ప్రాంతాన్ని శానిటేషన్‌పరంగా చక్కని నిర్వహణ వ్యవస్థ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఏ దుర్గేష్, జిల్లా పర్యాటక అధికారి పి వెంకటాచలం, పర్యాటకశాఖ మేనేజర్ సీహెచ్ పవన్‌కుమార్, డిప్యూటీ ఈఈ (పర్యాటక) జీ ఎస్‌వీవీ సత్యనారాయణ, సహాయ మేనేజర్ ఆర్ గంగరాజు, జిల్లా ఉద్యాన అధికారి బి సుజాతకుమారి, కడియం తహశీల్దారు కే పోశిబాబు, ఎంపీడీవో కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆధార్ నమోదు, నవీకరణ కేంద్రం

జిల్లా అభివృద్ధి అధికారి వీణాదేవి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ అర్జీలు అందజేసేందుకు వచ్చే ప్రజలకోసం ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్నట్టు జిల్లా అభివృద్ధి అధికారి పి. వీణాదేవి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈ ఆధార్ కేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 102 గ్రామ సచివాలయాల్లో ఆధార్ కిట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు సాంకేతిక నిపుణులను అందుబాటులో ఉంచి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని వీణాదేవి తెలిపారు. మండలాల వారీగా చాగల్లు 4, దేవరపల్లి 3, గోపాలపురం 3, కొవ్వూరు రూరల్ 5, కొవ్వూరు అర్బన్ 1, నల్లజర్ల 5, నిడదవోలు రూరల్ 4, నిడదవోలు అర్బన్ 1, పెరవలి 6, తాళ్లపూడి 3, ఉండ్రాజవరం 4, అనపర్తి 5, బిక్కవోలు 5, గోకవరం 4, కడియం 5, కోరుకొండ 5 రాజమహేంద్రవరం రూరల్ 7, రాజమహేంద్రవరం అర్బన్ 17, రాజానగరం 7, రంగంపేట 5, సీతానగరం మండలంలో 4 కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ సేవల్లో భాగంగా కొత్త ఆధార్ కార్డు నమోదు, బయోమెట్రిక్ నవీకరణ (వయస్సు 5-7 మరియూ 15-17) డిమోగ్రాఫిక్ అప్‌డేట్ (చిరునామా, ఫోన్ నంబరు మార్పు పేరులో తప్పులు) చేతివ్రేలు ముద్రల నవీకరణ, డాక్యుమెంట్ సవరణ వంటి సేవలు అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు.



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

'సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళతాం'

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 9 నుంచి తామంతా సమ్మెలోకి వెళతామని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ స్పష్టంచేసింది. ఈమేరకు సోమవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు కోటాని ముకుందరామ్, గుద్దాటి నరసింహమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమాదుల యేసుబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుంగా యెషయారాజు, అధ్యక్షుడు సిరికి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పాలిక బాలభవాని కుమార్, ఉపాధ్యక్షుడు మందనక్క సాయిలు విలేకరులతో మాట్లాడారు. గత 25 ఏళ్ల ఔట్‌సోర్సింగ్‌లో చాలీచాలని వేతనాలతో కార్మికులంతా దుర్భరజీవితాలు గడుపుతున్నామన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా రెండు రకాలుగా మంచినీటి విభాగం, స్ట్రీట్‌లైట్ విభాగం, ఇండోర్ అవుట్‌డోర్, వర్క్‌ఇన్స్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, గార్డీనర్లు, డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచాలని టెక్నికల్‌కు రూ. 29,200, నాన్‌టెక్నికల్‌కు రూ.24,500 ఇవ్వాలని, 15 ఏళ్లపైబడి కార్మికులను క్రమబద్ధీకరించాలని, విధుల్లో మరణించిన కార్మికుడికి రూ.10 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని డిమాండు చేశారు.

జగన్ విధ్వంసం చేసి వెళ్లిపోయాడు

రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ఆర్థిక విధ్వంసం చేసి వెళ్లిపోయాడని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో తననివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి చేసిన ద్రోహానికి, అన్యాయాలకు అక్రమాలకు ఉరిశిక్షే సరి అని వ్యాఖ్యానించారు. జగన్ గంజాయి, మత్తుమాదక ద్రవ్యాలను పెంచిపోషించాడని, అక్రమ మద్యంతో దోచుకున్నాడని ధ్వజమెత్తారు. పోలవరాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాకుండా జగన్ వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిని వెయ్యి కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సివస్తోందన్నారు. శాశ్వతంగా అధికారంలోకి ఉంటానని ఊహల్లో ఉండి రూ.560 కోట్లు పెట్టి రుషి కొండపై ప్యాలెస్ కట్టుకున్నాడని ధ్వజమెత్తారు. గడచిన ఐదేళ్లలో నీటిపారుదలకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రూ.3వేల పింఛను పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకున్నాడని, తల్లిని చెల్లిని బయటకు గెంటేశాడని విమర్శించారు. ఆదాని కేసులో తన ప్రమేయం లేదని అంటున్న జగన్ అప్పుడు ఆయన సీఎం కాదా అని ప్రశ్నించారు. ఇంటర్నేషనల్ సంస్థ చర్యలు తీసుకోవడానికి తన పేరు లేదని జగన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క వ్యవస్థ ప్రక్షాళన చేసుకుంటూ వస్తున్నామన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. అసైన్డ్ భూముల్లో లక్షలాది ఎకరాలను వైసీపీ దోచుకుందన్నారు. అన్ని లెక్కలు తేలుతాయన్నారు. జగన్‌ను చెప్పులు రాళ్లతో సత్కరించాలా అని ప్రశ్నించారు. అధికారం ఉందని గతంలో ప్రజలకు అందించాల్సిన బియ్యం వైసీపీ నేతలు విదేశాలకు తరలించేశారని.. సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లపై ఎవరు పోస్టులు పెట్టారో వారు శిక్ష అనుభవిస్తారన్నారు. ఈ సమావేశంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కడియం టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, దాలిపర్తి వేమన తదితరులు పాల్గొన్నారు.

కార్తీకానికి వీడ్కోలు



పాడ్యమి దీపాల వెలుగులో రాజమహేంద్రవరం గోదావరి తీరం

- భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి

అంతా శివనామస్మరణే. కార్తీకానికి వీడ్కోలు పలుకుతూ భక్తులు పోలి స్వర్గం (పోలి పాడ్యమి) సందర్భంగా అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి నదుల్లో వదిలారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి పాడ్యమి దీపాలు వెలిగించి పూజలు చేశారు.



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో పాడ్యమి దీపాలు వదులుతున్న భక్తులు



కార్తీక మాసం ముగింపు వేళ దక్షిణ కాశీగా పేర్గాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు



పంచారామ క్షేత్రం సామర్లకోటలో వెండి జటాఝూట అలంకరణలో కుమారారామ భీమేశ్వరస్వామి



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేసి దీపాలు వదులుతున్న భక్తులు



కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లిలో మహిళల పూజలు



జగ్గంపేటలో పాడ్యమి దీపాలు వెలిగిస్తున్న మహిళ



రాజమహేంద్రవరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



బ్రాహ్మణునికి దీపదానం (రాజమహేంద్రవరంలో)



పెళ్లి మండపాలు రెడీ



ఎ.వేమవరంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

మాసానాం మార్గశీర్షోహం

మార్గశిర మాసంలో పండుగలెన్నో.. డిసెంబరు 25 వరకు పెళ్లి సందడి

అమలాపురం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభో శివశంకరా.. అంటూ తన్మయత్వంతో భక్తుల శివనామస్మరణలతో ఈ ఏడాది కార్తీకమాసం ముగిసింది. కార్తీకం అలా వెళ్లగానే శివకేశవులకు బేధం లేదంటూ హరినామస్మరణలతో ఈనెల 2 నుంచి మార్గశిరమాసం ప్రారంభమైంది. మాసానాం మార్గశీర్షోహం అని గీతాచార్యుడు శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. మాసాల్లో మార్గశీర్షం తానేనని శ్రీకృష్ణ భగవానుడు ప్రకటించాడు. మార్గశిర మాసంలో హరినామాన్ని నోరారా పలికితే సకల శుభాలు కలుగుతాయని గోదాదేవి తిరుప్పావై ప్రబంధంలో పలుమార్లు పేర్కొంది. కలియుగంలో హరినామస్మరణను మించినది లేదని పురాణాలు చెబుతున్నాయి. శ్రీవైష్ణవులకు పరమ పవిత్రమైన ఈ మాసంలో శ్రీరంగనాథుడిని ప్రసన్నం చేసుకునేందుకు గోదాదేవి పాడిన తిరుప్పావై పాశురాలకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. అంతేకాకుండా ఈ మాసంలోనే సంక్రాంతి పండుగ సందడి కూడా ప్రారంభమవుతుంది. సంక్రాంతి నెల రోజుల పండుగతో ఇళ్లు రంగురంగుల రంగవల్లులతో సంక్రాంతి శోభను సంతరించుకుంటాయి. అటువంటి మార్గశిర మాసంలో వచ్చే పండుగలెన్నో. ఈ నెల 2న మార్గశిర మాసం ప్రారంభం కాగా 16న ధనుర్మాసం ప్రారంభమవుతుంది. డిసెంబరు 7న సుబ్రహ్మణ్య షష్టి జరుపుకుంటారు. ఆ రోజున జరుపుకునే కార్తికేయ పూజకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. 11న భగవద్గీత ఆవిర్భవించిన గీతాజయంతిని జరుపుకుంటారు. 13న హనుమద్వ్రతం జరుపుకుంటారు. ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహిస్తారు. అంతే కాకుండా ప్రదోష వ్రతం పేరున శివుడిని పూజిస్తారు. 15న మార్గశిర పూర్ణిమను పురస్కరించుకుని దత్తాత్రేయ జయంతిని నిర్వహిస్తారు. 16న సంక్రాంతి పండుగకు నెలపట్టుట. ధనుర్మాసం ప్రారంభం. 18న సంకష్టహర చతుర్థి రోజున వినాయకుని పూజలు జరుపుతారు. 22న కాలభైరవాష్టమి నిర్వహిస్తారు. కాలభైరవుడిని పూజించడం ద్వారా సకల కష్టాలను, దోషాలను అధిగమించవచ్చు.

4 నుంచి 25 వరకు ముహూర్తాలు



మార్గశిర మాసంలో జరుపుకునే పండుగలకు కొదవేలేదు. దానికి తోడు ఈ మాసంలో వివాహాది శుభ ముహూర్తాలు ఎక్కువే. ఈ నెల 4 నుంచి 25 వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. దీంతో ఏ వీధిలో చూసినా పెళ్లి సందడే కనిపించనుంది. ఈనెల 4,5,6,7, 10,11,20,25 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు అధికంగా ఉన్నాయి. ఈ మాసంలో శంకుస్థాపనలు చేయరు. ఇక గృహప్రవేశాలకు కూడా ముహూర్తాలు అధికంగానే ఉన్నాయి. ఈనెల 4,6,7,9,10,17,22,24 తేదీల్లో గృహ ప్రవేశాలకు ముహూర్తాలు ఉన్నాయి.

- కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, పంచాంగకర్త బండారులంక



ముమ్మిడివరంలోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గిరిశర్మ



గోవులకు దాణా పెడుతున్న గిరిశర్మ

ఆయనో అర్చకుడు.. గోసేవకుడు

ముమ్మిడివరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆయనో అర్చకుడు.. ఆదాయం అంతంతమాత్రమే. అయినా తనకు వచ్చే ఆదాయంలో సగం గోవుల సంరక్షణకు ఖర్చు చేస్తుంటారు. దేవుడితోపాటు గోవులకు సేవచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ముమ్మిడివరం శ్రీలక్ష్మీగణపతి ఆలయ అర్చకుడిగా పని చేస్తున్న వెలువలపల్లి గిరిశర్మ స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ. పద్దెనిమిదేళ్ల కిందట ముమ్మిడివరం వచ్చారు. భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉండడానికి సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వర్తక సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో అర్చకత్వం చేస్తున్నారు. నెల జీతం పది వేలలోపే. ఇదికాక భక్తులు ఇచ్చే ఐదో, పదో దక్షిణతోనే జీవనం. దీంతోపాటు హోమాలు, పెళ్లిళ్ల వంటి కార్యక్రమాలకు వెళతారు. కానీ ఈయనకు వచ్చే ఆదాయంలో రోజుకు 15 నుంచి 20 వీధి పశువులకు (ఆవులు, ఆబోతులు) ఉదయం, సాయంత్రం దాణా పెడుతుంటారు. అంటే రోజూ రూ.200 నుంచి రూ.250 ఖర్చు అవుతుంది. ఏదైనా పశువుకు అనారోగ్యానికి గురైతే వైద్య సేవలు అందిస్తుంటారు. వాటికి రెండు పూటలా దాణా పెట్టి నిమరందే తనకు నిద్ర పట్టదని గిరిశర్మ చెబుతారు. ఇలా గిరిశర్మ గోసేవతో తరిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు.



ప్రత్తిపాడు-వెల్లుర్తి రహదారిలో నర్సరీలో మొక్కల పెంపకం

గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో రంగురంగు పూలతో చూపరులను ఆకర్షిస్తున్న నర్సరీ



మొక్కలతో పాటు పూల కుండీల తయారీ

నర్సరీల మెట్ట.. ఎటైటా!

- మెట్ట ప్రాంతంలో నర్సరీల విస్తరణ
- గండేపల్లి టు తుని జాతీయ రహదారి పక్కన ఏర్పాటు
- చూపరులను ఆకట్టుకుంటున్న వివిధ రకాల మొక్కలు
- ప్రత్తిపాడులోను రెండు చోట్ల పెద్ద నర్సరీలు
- మొక్కల పెంపకంతో స్థానికులకు ఉపాధి
- శుభకార్యాలకు పూల అమ్మకాలు కూడా ఇక్కడే

గండేపల్లి/ప్రత్తిపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెట్టలో నర్సరీలా.. ఆశ్చర్యంగా ఉంది కదూ.. అసలు నర్సరీలు పేరు చెప్తే ఠక్కున గుర్తొచ్చేది కడియపులంక పేరే.. ఆ ప్రాంతంలోనే ఎక్కువగా నర్సరీలుంటాయి. పూలు, డెకరేషన్, ఇతరత్రా ఏమొక్కలు కావాలన్నా గోదావరి జిల్లాల్లో ఎవరైనా అక్కడికి వెళ్లి రావాల్సిందే. కానీ ఈ రెండు, మూడేళ్లలో మెట్ట ప్రాంతంలోనూ నర్సరీలు విస్తరిస్తున్నాయి. దీంతో ఇక్కడే రకరకాల పండ్ల, పుష్పాల మొక్కలు లభ్యమవుతున్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల్లో నర్సరీలు రెండు మూడేళ్లుగా అభివృద్ధి చెందుతున్నాయి. 16వ నెంబరు జాతీయ రహదారి పక్కనే గండేపల్లి మొదలుకొని తుని వరకు విస్తరించాయి. ప్రారంభంలో ఒక్కొక్కటిగా మొదలైన నర్సరీలు ప్రస్తుతం 15 వరకు ఏర్పాటయ్యాయి. మెట్ట ప్రాంతమైన గండేపల్లి మండలంలోని మురారి, గండేపల్లి, నీలాద్రిరావుపేట, జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లిలో రెండుచోట్ల, కిర్లంపూడి, ప్రత్తిపాడు, తుని మండలాల పరిధిలోను కొన్నిచోట్ల నర్సరీలు ఏర్పాటుచేశారు. ప్రత్తిపాడు మండలం బవురువాకలోను 50 ఎకరాల్లో ఒక నర్సరీ ఉంది. ఇదే మండలంలోని ఒమ్మంగిలోను 30 ఎకరాల్లో ఓ నర్సరీని విస్తరించారు. ఇక ప్రత్తిపాడు మండలం ధర్మవరం నుంచి పిఠాపురం వెళ్లే రహదారిలోని వెల్లుర్తిలోను ఓ నర్సరీ ఉంది. గండేపల్లి-తుని మధ్య హైవే పక్కనున్న నర్సరీల్లో పూలు, వివాహాలకు ఉపయోగించే పూల మొక్కలు, డెకరేషన్ సామగ్రి లభ్యమవుతోంది. ఈ నర్సరీల్లో రంగు రంగుల పూల మొక్కలు కనిపించడంతో హైవేపై వెళ్లేవారి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వాటిని చూసి ఆగి చాలామంది కొనుగోలు చేస్తున్నారు. కడియపులంకను తలపించేలా మెట్ట ప్రాంతంలో నర్సరీల ఏర్పాటుపై పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల చాలా మందికి ఉపాధి కలుగుతోంది. ఆయా గ్రామాల్లో ఉండే మహిళలు నర్సరీల్లో మొక్కల పెంపకం, వాటి నిర్వహణ పనులు చూస్తున్నారు. దీంతో వారికి నిత్యం పని దొరుకుతోంది. ఇలా ఈ పనులపై ఆధారపడి 200 మందికిపైగా మహిళలు, యువత ఉపాధి పొందుతున్నారు. కొందరు కడియపులంక నుంచి ఇక్కడకు వచ్చి ఈ నర్సరీలను నిర్వహిస్తున్నారు. స్థానికులు కూడా కొందరు మొక్కల పెంపకంపై ఆసక్తితో నర్సరీలు నడుపుతున్నారు. దీంతో మొక్కలు కావాలంటే కడియపులంకే కాదు.. ఇక్కడే కొనొచ్చని మెట్టవాసులు చెబుతున్నారు.



నర్సరీ పనిలో..

సత్యదేవునికి...

కాసులు కురిపించిన కార్తీకమాసం

అన్ని విభాగాల ద్వారా రూ.21.13 కోట్ల ఆదాయం



స్వామివారి ఖజానాకు చేరిన నోట్ల కట్టలు



స్వామి, అమ్మవార్లు

అన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈ ఏడాది కార్తీకమాసం కాసులు కురిపించింది. ఇప్పటికే వ్రతాల నిర్వహణలో ఆల్ టైం రికార్డు నెలకొల్పగా తాజాగా సోమవారం హుండీల లెక్కింపుతో కార్తీక మాస ఆదాయాన్ని అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాల ద్వారా రూ.21,13,82,068 ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే రూ.45 లక్షల ఆదాయం అధికంగా వచ్చింది. ఈ ఆదాయం రికార్డుగా నిలిచింది. ప్రధానంగా వ్రతం టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.8.33 కోట్లు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.4.86 కోట్లు, హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3.04 కోట్లు, సత్రం గదుల అద్దెల ద్వారా రూ.1.43 కోట్లు స్వామివారికి సమకూరింది. గతేడాది కంటే అన్ని విభాగాల ద్వారా ఆదాయం పెరగగా లీజులు విభాగం వసూళ్లు, ఇతర మిస్‌లీనియస్ ఆదాయపరంగా గతేడాదితో పోలిస్తే రూ.2.64 కోట్లు తగ్గింది. కార్తీకమాసంలో సుమారు కోటి మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు.

హుండీల ఆదాయం రూ.1.30 కోట్లు

సత్యదేవుని సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ.1,30,30,404 నగదు, 52.500 గ్రాముల బంగారం, 1125 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటు పలు దేశాల కరెన్సీ లభించింది. 13 రోజులకు ఈ ఆదాయం సమకూరింది. సరాసరిన రోజుకు రూ.10.02 లక్షలు చొప్పున భక్తులు హుండీల్లో కానుకల రూపంలో సమర్పించారు. సిబ్బంది లెక్కించగా చైర్మన్ రోహిత్, ఈవో త్రినాథరావు పర్యవేక్షించారు.

గతేడాది కార్తీకమాస ఆదాయం, ఈ ఏడాది కార్తీకమాసం ప్రధాన విభాగాల ఆదాయం ఈ పట్టికలో చూడవచ్చు.

విభాగము	2023(రూ.లో)	2024 (రూ.లో)
వ్రతం టిక్కెట్లు విక్రయాలు	7,03 కోట్లు	8.33 కోట్లు
ప్రసాదం విక్రయాలు	4.38 కోట్లు	4.86 కోట్లు
హుండీలలో వచ్చిన కానుకలు	2.81 కోట్లు	3.04 కోట్లు
సత్రం గదుల అద్దెల ద్వారా	89.98 లక్షలు	1.43 కోట్లు
కల్యాణ మండపాలు	5.47 లక్షలు	8.41 లక్షలు
ప్రత్యేక దర్శనాలు	67.01 లక్షలు	85.82 లక్షలు
ఏసీ వ్రతాల నిర్వహణ	47.60 లక్షలు	60.45 లక్షలు
రవాణా విభాగం	27.03 లక్షలు	40.81 లక్షలు
లైసెన్స్ ఇతర ఆదాయాలు	3.73 కోట్లు	1.09 కోట్లు



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు



సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న దంపతులు పూజలు



వేదాశీర్వచనం పొందుతున్న అంతర్జాతీయ స్విమ్మర్ శ్యామల దంపతులు

సామర్లకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి, సీఎం.పేషీ అధికారి ప్రద్యుమ్న సతీసమేతంగా భీమేశ్వరాలయం చేరుకుని స్వామి,అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదరంగా స్వాగతం పలికారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో పాటు ప్రసాదాలు... స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. అంతర్జాతీయ స్విమ్మర్ అవార్డు గ్రహీత గోలి శ్యామల తన భర్త గోలి మోహన్‌తో కలిసి భీమేశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారీ లడ్డూలు అందజేత

భీమేశ్వర స్వామికి ఝటా జుటం అలంకరణ పురస్కరించుకుని సామర్లకోట లయన్స్ క్లబ్ ప్రతినిధి అమలకంటి శ్రీనివాసరావు సౌజన్యంతో ఒక్కొక్కటీ 30 కిలోల పరిమాణంలో గల 3 భారీ లడ్డూలను ఆలయంలో అలంకరణ నిమిత్తం అందజేశారు. గత 15ఏళ్లుగా ఇస్తున్నరీతిలోనే ఈసారి కూడా లడ్డూలను అందజేశారు. పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య లడ్డూలను స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌ల ఎదుట అలంకరించారు. మంగరాజు, బుల్లియ్య, మురళీ పాల్గొన్నారు. స్వామివారికి వెండి ఝటా జుటం అలంకరణ సందర్భంగా దాతల సౌజన్యంతో ఆలయ ఆవరణను వివిధ పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. పలు ప్రధాన మండపాల వద్ద పండ్లతో అలంకరించారు. పూలతో ఓం నమఃశివాయ పేరిట అక్షర క్రమాన్ని ఆలయం నలువైపులా అలంకరించారు.



భీమేశ్వరునికి అందజేసిన భారీ లడ్డూలు

ప్రాచీన ఆలయాల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే పూజలు



బిక్కవోలులో ఎమ్మెల్యే శంకర్‌ను సత్కరిస్తున్న షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను సోమవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దర్శించారు. లక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు గొర్రెల త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీనివాస్, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.

నేడు ఏపీటీలో పాలీటెక్ ఫెస్ట్ ప్రారంభం

కాకినాడరూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన ప్రాంతీయస్థాయి పాలీటెక్ ఫెస్ట్ మంగళవారం ప్రారంభంకానుందని ప్రిన్సిపాల్ ఎస్.జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనకు జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 117 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారని, సుమారు 2000 మంది టెక్‌ఫెస్ట్‌లో పాల్గొననున్నారన్నారు. రెండు రోజుల పాటూ జరిగే ఈ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.25000, రెండవ బహుమతి రూ.10,000 బహుకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రాంతీయ సాంకేతిక విద్యాశాఖాధికారి జె.సత్యనారాయణ పాల్గొంటారని ఆయన చెప్పారు.

వీరేశ్వరస్వామి ఆదాయం రూ.50.43లక్షలు

ఐ.పోలవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేతవీరేశ్వరస్వామి కార్తీక మాస ఆదాయం రూ.50,43,680 వచ్చినట్టు ఆలయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. గతం కంటే ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. నిత్యకల్యాణం, పంచామృతాభిషేకాలు, లఘున్యాస అభిషేకాలు, ఇతర సేవల రూపంలో రూ.41,46,452, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,45,985, అన్నదాన ట్రస్టు ద్వారా రూ.7,51,043 సమకూరినట్టు ఆయన వివరించారు. వీరేశ్వరస్వామి ఆలయం టెంపుల్ టూరిజం ప్యాకేజీలో ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారన్నారు. ఆలయ ప్రాశస్త్యం పెరగడంతో ఆలయ గ్రేడ్ కూడా 6-ఎ నుంచి సహాయ కమిషనర్ హోదాకు చేరుకుందన్నారు. కార్తీక మాసంలో అన్నివిధాలా సహకరించిన అన్ని శాఖల ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కుటేశునికి ప్రత్యేక పూజలు

పిఠాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమి సందర్భంగా పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కొలువయి ఉన్న స్వయంభూ కుక్కుటేశ్వరస్వామికి సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు జరిగాయి. విశేష పూజలు అనంతరం స్వామిని ఝటా జుటంతో అలంకరించారు. స్వామిని భక్తులు దర్శించుకున్నారు.



పాదగయ క్షేత్రంలో ఝటా జుటం అలంకరణలో కుక్కుటేశ్వరస్వామి

48 గంటలపాటు మద్యం బంద్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం
- ఉభయగోదావరి జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలకు నిబంధన వర్తింపు
- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 48గంటలపాటు మద్యం దుకాణాలను బంద్ చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలకు ఈ నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ఈనెల 5వతేదీ సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలను ఏపీ ప్రభుత్వ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఆదేశాల మేరకు బంద్ చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలనే లక్ష్యంతో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించామని ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న జిల్లాలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతమైన వాతావరణంలో సమర్థంగా నిర్వహించాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో జె.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్‌లో పోలింగ్ అధికారులు, సిబ్బందికి సోమవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 16,737 మంది ఓటర్లు ఉండగా 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ జిల్లాలో ప్రత్యేకంగా 3418 మంది ఓటర్లు ఉండగా వారి కోసం 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ఈనెల 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను సురక్షితంగా కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తామని ఆయన తెలిపారు. తొలుత పోలింగ్ ప్రక్రియపై పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ మెటీరియల్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, పీవో డైరీ, మైక్రో అబ్జర్వర్ల విధులు, ఫర్నీచర్, విద్యుత్తు, పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.

కుమార్తెను చూసేందుకు వెళుతూ...

వ్యాన్ ఢీకొనడంతో తండ్రి మరణం



వ్యాన్ చక్రాల కిందకి వెళ్లిపోయిన యాక్టివా బండి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న కుమార్తెను పరామర్శించేందుకు వెళుతూ...మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం గొడారిగుంట వీఎస్ లక్ష్మీకాలేజీ సమీపంలో జరిగింది. కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన మత్స్యకారుడు దాసరి ధనకొండ (45)కు భార్య సరస్వతి, అబ్బాయి ఆకాశ్, కుమార్తె మానస ఉన్నారు. అతడు స్థానిక ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు పట్టిన చేపలకు వేలంపాట పాడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుమార్తెను ప్రసవం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా ఇటీవల శస్త్రచికిత్స చేసి ప్రసవం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న కుమార్తెను పరామర్శించేందుకు సోమవారం సాయంత్రం యాక్టివా బండిపై బయలుదేరి వలసపాకల సెంటర్ నుంచి గొడారిగుంట మీదుగా ఆస్పత్రికి పయనమయ్యాడు. ఈ క్రమంలో బొందగుంటలో వీఎస్ లక్ష్మీకాలేజీ దాటిన తర్వాత శశికాంత్‌నగర్ రోడ్డు నాలుగురోడ్ల సెంటర్‌లో వ్యాన్ ఢీకొనడంతో బైక్ వ్యాన్ కిందకి వెళ్లిపోగా ధనకొండ తలకు తీవ్ర గాయంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన అతడిని స్థానికులు చికిత్స కోసం సమీపంలోని లక్ష్మీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుమార్తెను చూసి వచ్చేస్తానంటూ ఇంటి నుంచి బైక్‌పై వెళ్లిన కొద్దిసేపటికే భర్త మరణవార్త విన్న భార్య కుప్పకూలిపోయింది. పొద్దుపోయింది, ఈ రోజు వద్దు రేపు వెళ్లమని చెప్పినా వినకుండా ఈ రోజే కుమార్తెను చూసి వచ్చేస్తానంటూ వెళ్లిన భర్త ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతాడని కలలో కూడా అనుకోలేదని కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాదసమాచారం తెలిసిన వెంటనే సర్పవరం సీఐ బి పెద్దిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



మరణించిన ధనకొండ (ఫైల్)

వ్యక్తి అనుమానాస్పద మృతి

హత్యగా స్థానికుల వెల్లడి
పోలీసుల దర్యాప్తు

కాకినాడ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పాత కక్షల నేపథ్యంలో హత్యకు గురైన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. అయితే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ పాత బస్టాండ్ సెంటర్ సమీపంలోని టీటీ ఆసుపత్రి వెనుక భాగంలోని ధనమ్మగుడి వీధికి చెందిన బట్టు దానయ్య అలియాస్ దాలి (35) గతంలో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసేవాడు. అయితే అతడు అప్పటికే పాత నేరస్తుడు. పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. ఏ పనికి వెళ్లకు ండా తాగి జులాయిగా తిరిగేశాడు. అతడికి పెళ్లి కాలేదు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారు జామున సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ పక్క సందులోని సిమెంట్ రోడ్డుపై దానయ్య రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. అది గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం.నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని దానయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. అయితే ముగ్గురు అగంతకులు రాడ్‌లతో దానయ్యను కొట్టి చంపినట్టు స్థానికులు చెబుతున్నారు. సీసీకెమెరాల పరిశీలనలో కూడా ఇదే విషయం వెల్లడైనట్టు తెలుస్తుంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దానయ్య మృతదేహం

దుబాయ్ నుంచి స్వగ్రామానికి రమేష్ మృతదేహం

ఆత్రేయపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం దుబాయ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన అంగర రమేష్(35) మృతదేహం సోమవారం ఉదయం స్వగ్రామం చేరుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన రమేష్ ఉపాధి కోసం దుబాయ్‌లోని దేరా ప్రాంతంలోని ఓ ప్రవేట్ కంపెనీలో పనిచేసేవాడు. గత నెల 15న అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. దుబాయ్ నుంచి మృతదేహాన్ని స్వగ్రామం రప్పించడం కోసం మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు ప్రయత్నాలు సాగించడంతో దుబాయ్ నుంచి విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు రమేష్ మృతదేహాన్ని తీసుకువచ్చారు. సోమవారం కుటుంబ సభ్యులు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి పేరవరం స్వగ్రామానికి తీసుకువచ్చారు. బంధుమిత్రులు రమేష్ మృతదేహం వద్ద బోరున విలపించారు. భార్య కవిత, ఇద్దరు కుమారులు మాకు దిక్కెవ్వరంటూ రోదించారు. అనంతరం స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.



పేరవరంలో రమేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

టేబుల్ టెన్నిస్ పోటీల్లో...

జేఎన్టీయూకే జట్టుకు ప్రథమస్థానం



టేబుల్ టెన్నిస్ జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

జేఎన్టీయూకే, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీల్లో జేఎన్టీయూకే కళాశాల జట్టు ప్రథమస్థానంలో నిలిచినట్టు వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా రెండు యూనివర్శిటీల సెలక్షన్‌లను కూడా సాధించారన్నారు. ఈ జట్టు ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకూ తమిళనాడులోని వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో జరగనున్న యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో నిలిచిన టీటీ జట్టు, శిక్షణ నిచ్చిన పీడీలను యూసీఈకే ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, శ్యామ్‌కుమార్ అభినందించారు.

గెద్దాడలో ఓఎన్జీసీ పైపులైను స్వల్ప లీకేజీ

మరమ్మతులు నిర్వహించిన అధికారులు



పైపులైనుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గెద్దాడ-వేగివారిపాలెం సరిహద్దులో ఓఎన్జీసీకి చెందిన పైపులైను స్వల్పంగా లీకైంది. లీకేజీని గుర్తించిన స్థానికులు ఓఎన్జీసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పైపులైను ద్వారా గ్యాస్ సరఫరాను నిలుపుదలచేసి మరమ్మతు చర్యలు చేపట్టారు. తాటిపాక స్ట్రక్చర్‌లోని తాటిపాక 6వ బావి నుంచి పైపులైను ద్వారా నగరం జీసీఎస్‌కు గ్యాస్ సరఫరా అవుతుంది. పైపులైనుకు లీకేజీ ఏర్పడిన పైపును సుమారు 10నుంచి 12అడుగుల మేర తొలగించి కొత్త పైపును ఏర్పాటు చేశారు. ఈ బావి నుంచి ఉత్పత్తి అవుతున్న సహజవాయువు హెచ్చుతగ్గుల్లో ఉండడం వల్ల ఇటీవల డ్రిల్లింగ్ నిర్వహించారు. తరువాత ఈ బావి నుంచి గ్యాస్ ఉత్పత్తి పెరిగిందని సంబంధిత అధికారులు తెలియచేశారు. లీకేజీ అయిన పైపులైనుకు మరమ్మతులు నిర్వహించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ల రికవరీ సులభం

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ



ఫిర్యాదుదారుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్ల రికవరీ సులభం అవుతోందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న/దొంగతనానికి గురైన సందర్భాల్లో వెంటనే సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో 450 సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశారు. చాట్‌బాట్/ సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకూ 1843 సెల్ ఫోన్లు రికవరీ చేశామన్నారు. సెల్ ఫోన్లు దొరికినా, బిల్లుల లేని ఫోన్లను దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి అందజేయాలన్నారు. దొంగతనానికి గురైన సెల్‌ఫోన్లు కొనుగోలు చేసిన వారు కూడా చిక్కుల్లో పడకతప్పదని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియా, సైబర్ క్రైం టీం ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వరరావు, సిబ్బందిని అభినందించారు.

కార్మిక నేతలపై కేసులు కొట్టివేత

తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివీస్ వ్యతిరేక ఉద్యమంలో కార్మిక నేతలపై పోలీసులు పెట్టిన కేసులను కాకినాడ జిల్లా తుని కోర్టు సోమవారం కొట్టేసింది. 2016లో దివీస్ ఉద్యమకారులపై నమోదైన కేసులు ఎనిమిదేళ్ల పాటు కోర్టులో నడిచాయి. అనేక మంది సాక్షులను విచారించారు. పూర్వాపరాలను పరిశీలించి తుని మేజిస్ట్రేట్ తీర్పు ఇవ్వడంతో ఉద్యమకారులపై నమోదైన 10 కేసులు తుని కోర్టు కొట్టేసింది. రెండు కేసుల్లో 13 మంది ఉన్నారు. ఈ కేసును అడ్వకేట్ మల్లేశ్వరరావు వాదించారు.

సిగరెట్ కోసం..

మద్యం మత్తులో ఇద్దరి మధ్య కొట్లాట

తీవ్రంగా గాయపడి
చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మరణించిన వీరబాబు

మండపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిగరెట్ కోసం ఇద్దరి మధ్య మద్యం మత్తులో జరిగిన సంఘర్షణ వ్యక్తి ప్రాణాలను తీసింది. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండపేటలోని ఎస్సీకాలనీ 7వవార్డులో ఉన్న విశ్రాంతి మందిరంలో కాలనీకి చెందిన సుందరపు వీరబాబు నిద్రిస్తున్నాడు. అతడి వద్దకు అదే కాలనీకి చెందిన వేమగిరి సురేష్ తాగి వచ్చి చలిగా ఉంది సిగరెట్ కావాలని అడిగాడు. వీరబాబు తన వద్ద సిగరెట్ లేదని చెప్పాడు. సిగరెట్ కోసం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మాట మాట పెరిగి కొట్లాటకు దారితీయడంతో సురేష్ వీరబాబుపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతడిని ఆదివారం రాత్రి 108వాహనంలో మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరబాబు(35) సోమవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. వీరబాబుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనపై రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ దొరరాజు విచారణ చేపట్టారు. క్లూస్‌టీం డాగ్‌స్క్వాడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించాయి. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మండపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై ఎరుపుతెలుపు గీతల చొక్కా, పట్టుపంచె, పసుపురంగు తువ్వాలు ఉన్నాయి. స్థానికులు మండపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చిరుజల్లులు.. రైతుల్లో గుబులు

» పంటను కాపాడుకునేందుకు తంటాలు » మరోవైపు కోతలు నిలిపివేత



కొత్తపల్లిలో తడిసిన ధాన్యం రాశులను ఆరబెడుతున్న రైతులు

గోకవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. మూడు రోజులుగా పడుతున్న చిన్నపాటి జల్లులకు కళ్లాల్లో ఉన్న ధాన్యం రాశులను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. ఇంకోపక్క ఎక్కడికక్కడే కోతలను నిలిపేసారు. ప్రస్తుతం వర్షం అంతగా కురవకపోయినప్పటికీ నాలుగైదు రోజుల పాటు యంత్రాలు పొలాల్లోకి వెళ్లి నూర్పిళ్లు చేసే అవకాశం ఉండదని రైతులు భావిస్తున్నారు. అదును దాటి కోతలు కోస్తే దిగుబడి తగ్గిపోతుందని భయపడుతున్నారు. ఇప్పటికే నాట్లు సమయంలో కొంతమేర నష్టపోయామని, పంట చేతికందే సమయంలో విపత్తు సంభవిస్తే ఇంక కోలుకోలేమని మనోవేదనకు గురవుతున్నారు. గతంలో కంటే ఈ ఏడాది పంటల దిగుబడి అధికంగా ఉంటుందని భావిస్తున్న తరుణంలో దాపురించిన తుఫాన్ ఏరూపంలో నష్టాన్ని చేకూరుస్తోందోనని ఆందోళన చెందుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో ఇసుక తీత పనులు



క్రిస్మస్ వేడుకలు చేస్తున్న బోట్స్‌మెన్ సొసైటీలు

క్రిస్మస్ వేడుకలో బోట్స్‌మెన్ సొసైటీలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చొరవ వల్లే రాజమహేంద్రవరంలో బోట్స్‌మెన్ సొసైటీలు ఇసుక తీత పనులు చేసుకుని ఉపాధి పొందుతున్నాయని కోటిలింగాల ఇసుక రేవు బోట్స్‌మెన్ సొసైటీల సభ్యులు అన్నారు. కూటమి ప్రభుత్వంలో ర్యాంపుల్లో ఇసుక తీత పనులు చేసుకుంటున్న సొసైటీలు సోమవారం రాత్రి క్రిస్మస్ వేడుకను నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ విందు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాకీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీని సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. ఇసుక తీత పనులు పుష్కలంగా ఉండడం వల్ల బోట్స్‌మెన్ సొసైటీలు ఆనందగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, డీఎల్‌ఎస్‌ఈ చైర్మన్, కలెక్టర్ ప్రశాంతిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, గెడ్డం రమేష్, రాంబాబు, రెడ్డి శ్రీనివాస్, సూరిబాబు, సూర్య, శేఖర్, సుందరం, కే ప్రభ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలు పాటించాలి



సదస్సులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువత భారతీయ సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల సెమినార్ హాల్‌లో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాస సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతను మంచి మార్గంలో నడిపించాల్సిన కళాశాలలు కొన్ని దారి తప్పుతున్నాయని అన్నారు. అనపర్తిలోని ఓ ప్రైవేటు కళాశాలలో జాతీయజెండా ఏర్పాటుకు లక్షలాది రూపాయలు వసూలు చేయడం సిగ్గుచేటన్నారు. రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామి సేవ్యానందజీ మహరాజ్ ప్రసంగిస్తూ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. కడప ప్రతినిధి స్వామి సన్నివాసానందజీ మహరాజ్ ప్రసంగిస్తూ వివేకానందుని ప్రభావంతో ఎందరో మహనీయులుగా మారారన్నారు. పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మఠం ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీచే ఆర్ట్స్ కళాశాలకు ప్రథమ బహుమతి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :యువత తప్పుడు మార్గం పట్టకుండా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిలో చైతన్యం కల్గిస్తున్నందుకు రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీచే రాష్ట్రస్థాయిలో తమ కళాశాలకు ప్రథమ బహుమతి లభించిందని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ రవితేజ కళాశాల తరఫున ప్రథమ బహుమతిని, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారని తెలిపారు. రెడ్ రిబ్బన్ కమిటీ సభ్యులను అభినందిస్తున్నామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు

క్రీడాభారతి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) :క్రీడాభారతి అవార్డు కోసం 12 ఏళ్లు, ఆ పైబడిన క్రీడాకారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పౌరుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శేషగిరి తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాలమేరకు చైతన్య కశ్యప్ ఫౌండేషన్ వారు ఈనెల 8వ తేదీన ఆన్‌లైన్‌లో క్రీడాజ్ఞాన పరీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనేందుకు ముందుగా క్రీడా భారతి.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటలలోపు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

నగరపాలక సంస్థ పీజీఆర్‌ఎస్‌లో 20 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో ఇంచార్జీ అదనపు కమిషనర్ వెంకటరమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 20 అర్జీలను స్వీకరించారు. ఆస్తిపన్ను లెక్కకు ఎక్కువగా వస్తుందని దానిని తగ్గించాలని బి.వెంకటప్రసాద్ అనే వ్యక్తి, తాగునీటి సమస్య పరిష్కరించాలని క్వారీ సెంటర్‌లో తాగునీటి పంపింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు, నగరంలో అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి కుమార్ అనే వ్యక్తి, జీవనాధారంలేని తనకు ఉపాధి కోసం మునిసిపల్ షాపు కేటాయించాలని రాజకుమారి అనే మహిళ అర్జీలను అందించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, సిటీ ప్లానర్ జి.కోటయ్య పాల్గొన్నారు.

టూరిజం హబ్‌గా రాజమహేంద్రవరం

» హేవ్‌లాక్‌కు పర్యాటక శోభ తెస్తాం » ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి పర్యాటక మహర్దశ పడుతుందన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ సహకారంతో ఇప్పటికే టెంపుల్ టూరిజం ప్రత్యేక సర్వీసులు ప్రారంభించామన్నారు. గోదావరి నదిపై మూడు కిలోమీటర్ల పొడవున్న హేవ్‌లాక్ బ్రిడ్జికి పర్యటక శోభ తీసుకువచ్చేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి దుర్గేష్ కృషి చేస్తున్నారని, కేంద్రమంత్రి షెకావత్‌తో మాట్లాడారని చెప్పారు. హేవ్‌లాక్ బ్రిడ్జి పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయింపజేశారని చెప్పారు. గోదావరి లంకల్లో రిసార్ట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పుష్కరాలకు ఇప్పటి నుంచే అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈనెల 12న ఢిల్లీకి ఎయిర్ బస్ సర్వీస్‌లు ప్రారంభమౌతాయని, అలాగే షిర్డీ, తిరుపతికి సర్వీసులు మొదలవుతాయని, దేశంలో ముఖ్యపట్టణాల నుంచి విమాన సర్వీసులు రాజమహేంద్రవరానికి తిప్పడం ద్వారా ఇక్కడ పర్యాటక ఆదాయంతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, యిన్నమూరి దీపు, నక్కా దేవి వరప్రసాద్, బుడ్డిగ రాధ, శెట్టి జగదీష్, బుడ్డిగ రవి, నల్లం శ్రీను, నిమ్మలపూడి గోవింద పాల్గొన్నారు.

చార్జీల పెంపు ఉపసంహరించాలి

కడియం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ రూరల్ ఇన్‌చార్జి తాడాల కొండ్రాజు తెలిపారు. బుర్రిలంకలో పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో విద్యుత్ చార్జీలు పెంచమని కూటమి హామీ ఇచ్చిందని, అయితే ఎన్నికల తరువాత విద్యుత్ చార్జీల పెంపు సామాన్య ప్రజలపై భారం పడుతుందన్నారు.

సాగులో యాంత్రీకరణతో ఎక్కువ లాభాలు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో యాంత్రీకరణ పద్ధతులు అవలంబించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డి.శ్రీనివాస్ అన్నారు. రాజవోలు వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా యాంత్రీకరణ, ఎలుకల నివారణ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జీపీఎస్ గైడెడ్ ట్రాక్టర్ల నుంచి ఆటోమెటిక్ నీటిపారుదల వ్యవస్థల వరకు వ్యవసాయ యంత్రాలతో రైతులకు పురోగతి మరింత సమర్థవంతంగా,ఉత్పాదికంగా పనిచేయడంలో సహాయ పడుతుందన్నారు. అనంతరం ఎలుకల నివారణపై విషపు ఎర తయారు చేసే విధానాన్ని ఎంటమాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అనూష వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డి.సాయిగంగాధరరావు, సీహెచ్ సునీత, హెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి

రాజానగరం/దివాన్‌చెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమిని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో శివాలయాలను దర్శించి ఆలయ ప్రాంగణాలలో దీపాలు వెలిగించారు. అనంతరం పురోహితులు పోలిస్వర్గం కథను వినిపించారు. భక్తులు దీప, స్వయంపాక, శాలిగ్రామ దానాలు చేశారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

రంగంపేట,డిశంబరు 2 (ఆంధ్రజ్యోతి): సుభద్రంపేటలో సోమవారం ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కత్తి శ్రీనును అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో అన్నసమారాధన

ధవళేశ్వరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా సోమవారం మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా పులిహోరాతో చేసిన స్వామివారి రూపం భక్తులను ఆకట్టుకుంది. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి ఆలయానికి విచ్చేసి స్వామివారికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, వాసిరెడ్డి రాంబాబు సవాడ శ్రీనివాసరెడ్డి, నీలి కోటేశ్వరరావు, నాల్ల రమేష్, వి.రాజేష్, ఆలయ ఈవో నాగసురేష్ పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత పాటించాలి

డీఈ శ్రీధర్‌వర్మ

కడియం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) విద్యుత్ పట్ల భద్రతగా మెలగాలని డీఈ శ్రీధర్‌వర్మ చెప్పారు. కడియం విద్యుత్‌శాఖ కార్యాలయ ఆవరణలో విద్యుత్ శాఖ ఉద్యోగులు భద్రత సూచనలు పాటిస్తామని, ప్రజలకు అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఈ శ్రీధర్‌వర్మ మాట్లాడుతూ ప్రజలు విద్యుత్ లైనులకు దూరంగా ఇల్లు కట్టుకోవాలని, నర్సరీ రైతులు మొక్కలు ఎగుమతి చేయించే సమయంలోను పామాయిల్ గెలలు కోసే సమయంలోను జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లారీల్లో ఎత్తైన మొక్కలు వేసే సమయంలో విద్యుత్‌లైన్లను గమనించాలని చెప్పారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైలా సన్యాసిరావు, కడియం ఏఈ వి.శ్రీనివాసరావు, కోటిరావు, రామారావు, జూనియర్ ఇంజనీర్లు రమేష్, కాశీ, లైన్‌ఇన్‌స్పెక్టర్లు, కడియం, మురమండ విద్యుత్ సెక్షన్ల లైన్‌మేన్‌లు పాల్గొన్నారు.

ఆపరేషన్ చేస్తే చూపు పోయింది



ఆస్పత్రి వద్ద బాధితుల ధర్నా

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): చూపు మెరుగు పడడానికి ఆపరేషన్ చేయిస్తే మొత్తానికి చూపు పోయిందని ఆరోపిస్తూ దేవీచౌక్ సమీపంలోని బుద్ధుడు ఆస్పత్రి(సిద్ధార్థ నర్సింగ్ హోం అండ్ పోలీ క్లినిక్) వద్ద బాధితురాలు కాతేరుకు చెందిన బి.అమ్మాజీ ధర్నాకు దిగారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 11న ఎడమ కన్ను శుక్లాలకు ఆపరేషన్ చేశారు. అదే రోజున ఇంటికి పంపేశారు. అయితే చూపు మెరుగ పడడం లేదని వారం తర్వాత ఆస్పత్రికి వెళ్తే.. సమయం పడుతుందని వైద్యులు చెప్పారు.మూడు వారాలు గడిచేసరికి చూపు పూర్తిగాపోయింది. దీంతో వేరే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించారు. అవసరం లేకపోయినా ఆపరేషన్ చేశారని, ఈ కన్ను ఇంక బాగుపడదని చెప్పారు. దీనిపై బుద్ధుడు ఆస్పత్రి వైద్యులను సంప్రదిస్తే సరైన స్పందన లేదని, న్యాయం చేయాలని ధర్నాకు దిగామని బాధితురాలి కుమారుడు దుర్గాప్రసాద్ వివరించారు. కుడి కన్ను అప్పటికే సరిగా కనబడదని చెప్పినా కాస్త మంచిగా చూపు ఉన్న ఎడమ కన్నుకు ఆపరేషన్ చేశారని, ఇప్పుడు తన తల్లి పూర్తిగా రెండు కళ్ల చూపు కోల్పోయిందని ఆయన వాపోయాడు.

యోగా పోటీలకు గైట్ విద్యార్థి

రాజానగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన ఇంటర్ యూనివర్శిటీ యోగా పోటీల్లో తమ కళాశాల విద్యార్థి అంకిత్ దేబ్నాద్ వ్యక్తిగత విభాగంలో చక్కని ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికైనట్టు గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డి.ధనరాజు తెలిపారు. ఈసందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 24నుంచి భువనేశ్వర్‌లోని కళింగ యూనివర్శిటీలో జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ యోగా పోటీలకు అర్హత సాధించాడన్నారు.

వలంటీర్లను కొనసాగించాలి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని, వారికి న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 5న రాజమహేంద్రవరంలో సదస్సు నిర్వహిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ శాసన మండలి సమావేశాల్లో వలంటీర్ల వ్యవస్థలేదని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి చెప్పడం అన్యాయమని, వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని కోరారు.

ఆలయ, అన్నదాన కమిటీ సభ్యులకు అభినందన

కోరుకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం సందర్భంగా కోరుకొండ శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి సన్నిధిలో 30రోజులు పాటు భక్తులందరికీ అన్నప్రసాదాలు అందించాలనే ధృడ సంకల్పంతో ప్రారంభించిన కార్తీక అన్న సమారాధన కార్యక్రమం సోమవారంతో దిగ్విజయంగా ముగిసిందని ఎమ్మెల్యేబత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. చివరిరోజు సోమవారం పోలి స్వర్గం సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆయన సతీమణి వెంకటలక్ష్మి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కల్యాణ మండపం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే అన్నదాన కమిటీ సభ్యులకు, ఆలయ కమిటీ వారికి అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ రమణ సమక్షంలో అన్నవరం దేవస్థానం వారి కండువాలను వేసి అన్నప్రసాదాలను అందజేసి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అన్నదాన కమిటీ అధ్యక్షుడు తనకాల నాగేశ్వరరావు, ఆలయ అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మి సరోజ, కర్రి వీరగణేష్, టీడీపీ నాయకులు అడపా వీరబాబు, శ్రీరంగపట్నం మాజీ సర్పంచ్ తనకాల బాబు, జనసేన నాయకుడు చదువు ముక్తేశ్వరరావు, డాక్టర్ అడపా శ్రీనివాసు, శివ, టీడీపీ నాయకులు, అర్చక స్వాములు, అన్నవరం దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవ పనుల పరిశీలన

బిక్కవోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులో ఈనెల 6 నుంచి 12 వరకూ నిర్వహించే షష్ఠి ఉత్సవ పనులను సోమవారం ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ భవ్యకిషోర్ పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటుచేసి స్వామి దర్శనాలు కల్పించాలని, మహిళలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. వాహనాలు గ్రామంలోకి రాకుండా వంతెన వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈమె వెంట షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి, అనపర్తి సీఐ సుమంత్, బిక్కవోలు ఎస్‌ఐ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు

విద్యార్థినులపై లైంగిక వేధింపులు!

● ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

● గిరిజన సంక్షేమ పాఠశాల వద్ద పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో ధర్నా

రాజమండ్రిరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు టి.సత్యనారాయణ విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నాడంటూ పీడీఎస్‌యూ, పీవోడబ్ల్యూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలవద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుడిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించి వేధింపులకు గురవుతున్న బాలికలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత రైతుకూలీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటనాయుడు మాట్లాడుతూ విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు బాలికల పట్ల ప్రవర్తిస్తున్న తీరును ఖండిస్తున్నామని, అతడిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘ నాయకురాలు మల్లిక మాట్లాడుతూ బాలికలను వేధిస్తున్న ఉపాధ్యాయుడుపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి అరెస్ట్ చేయాలని, ఉద్యోగం నుంచి తొలగించాలన్నారు. పాఠశాలలో బాలికలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం

రంగంపేట,డిశంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రంగంపేట బీసీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పశువుల ఆసుపత్రి భవనం, మరుగుదొడ్డి భూమి కలిపి మొత్తం ఎకరా 21సెంట్లు ప్రభుత్వ భూమిఉండగా దానిలో సుమారు 70 సెంట్లు భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. దానిని గ్రామ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి వెలిచేటి శ్రీరామమూర్తి సోమవారం ఆక్రమణలను తొలగించి మరుగుదొడ్డి భూమిని ఎక్స్‌కవేటర్‌తో శుభ్రం చేయించామని శ్రీరామమూర్తి చెప్పారు. 70 సెంట్లు భూమిలో 25 సెంట్లు భూమిని అంగన్వాడీలకు ఆకు కూరలు పండించడానికి కేటాయించామని, మిగిలిన స్థలం గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని ఆయన తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్ర జ్యోతి): రాజమండ్రి-కొవ్వూరు రైల్వేస్టేషన్ల నడుమ రైల్వేట్రాక్‌వద్ద గుర్తు తెలియని మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నామని ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) ఎస్‌ఐ మావుళ్లు తెలి పారు. మృతుడికి సుమారు 50ఏళ్ల ఉంటా యన్నారు. వివరాలు తెలిసిన వారు 944062 7551కి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024 | 5









రాజమహేంద్రి పుష్కర ఘాట్‌లో పోలి స్వర్గం దీపాలను వదులుతున్న భక్తులు.. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో పుణ్య స్నానాలు.. దీపార్చనలు

దేదీప్యమానమై..

గోదావరిలో పోలి స్వర్గం దీపాల వరుసలు

ఘాట్లలో పుణ్యస్నానాలు.. కార్తీకానికి వీడ్కోలు

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసానికి భక్తులు వీడ్కోలు పలికారు. అలాగే పోలి పాడ్యమి సందర్భంగా దీపాలను గోదావరి నదిలో వదిలారు. సోమవారం తెల్లవారుజాము నుంచే రాజమహేంద్రవరం గోదావరి ఘాట్‌లు భక్తులతో సందడిగా మారాయి. పుష్కరాల ఘాట్, కోటిలింగాల ఘాట్, టీటీడీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్‌లలో పుణ్య స్నానాలు చేసి దీపాలు నదిలో వదిలారు. పురోహితులకు దీప, స్వయంపాక, శాలిగ్రామ దానాలు చేశారు. అనంతరం మహాశివును దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అలాగే కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో భక్తులు గోదావరి పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు అరటిడొప్పలలో నేతి దీపాలను వెలిగించి పోలి స్వర్గం దీపాలను నదిలో వదిలారు. ప్రధాన స్నానఘట్టంలో శివలింగాలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. క్షేత్రంలో రావిచెట్టు వద్ద నాగశిలలకు పాలు, నదీ జలాలతో అభిషేకించారు. ప్రధాన స్నానఘట్టం, తులసి, రావిచెట్ల వద్ద, సుందరేశ్వరస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద కార్తీక దీపాలను వెలిగించారు.



ఉచిత ఇసుకకు తూట్లు

- బోట్స్‌మన్ సొసైటీల పేరిట దోపిడీ
- లారీకి రూ.6 వేల వరకూ వసూలు
- ర్యాంపులో 20 టన్నుల లారీకి రూ.11 వేలు
- కాకినాడకు లారీకి రూ.28 వేలపైనే
- పేరుకే బోట్స్‌మన్ సొసైటీలు
- ఇతర రాష్ట్రాల కార్మికులతో పని
- కొన్ని సొసైటీలు బోగస్
- వైసీపీకి చెందిన ఆర్కే చేతిలో బోట్స్‌మన్ సొసైటీలు
- నెలాఖరితో అనుమతులకు చెల్లు
- రాత్రి వేళల్లో డ్రెడ్జింగ్
- కడియపులంక ఓపెన్ ర్యాంపులో నిలువుదోపిడీ
- అఖండ గోదావరిలో డ్రెడ్జింగ్‌కు టెండర్లు

ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు. రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వానికి వచ్చే రూ. వందల కోట్ల ఆదాయాన్ని కాదనుకుని, ఎన్నికల ముందు ఇచ్చి హామీ మేరకు ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. వీటికి జీఎస్‌టీలు, సీనరేజ్ కూడా రద్దు చేశారు. బోట్స్‌మన్ సొసైటీల వద్ద టన్నుకు రూ.195, ఓపెన్ రీచ్‌ల వద్ద టన్నుకు రూ.140వరకూ నిర్ణయించారు. కానీ ఎక్కడా ఈవిధంగా వసూలు చేయడంలేదు. ప్రతీ చోట టన్నుకు రూ. 450 వరకూ వసూలు చేస్తున్నారు. 20 టన్నుల లారీకి ర్యాంపులో సుమారు 4 వేల 600వరకూ వసూలు చేయవలసింది, ఏకంగా రూ.11వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అధికారులు ఎంత కట్టుదిట్ట చర్యలు చేపట్టినా, రాజకీయ నేతల కనుసన్నలలో ఇసుక మాఫియా విజృంభిస్తోంది.

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండగోదావరిలో నీటిలో దిగి ఇసుక తీసి, ఒడ్డుకు చేర్చి ఉపాధి పొందడం కోసం కూలీలు, పేదలతో పూర్వం బోట్స్‌మన్ సొసైటీలు ఉండేవి. ఇవాళ సామాన్యుల చేతుల నుంచి బోట్స్ జారీ పోయాయి. పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈసారి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు వైపు మొత్తం 275 సొసైటీలు రిజిస్టర్ అయ్యాయి. అందులో అధికారులు 140 బోట్స్‌మన్ సొసైటీలకు అనుమతి ఇచ్చారు. కానీ అందులో పనిచేసేవి 100 కూడా లేవు. చాలా వరకూ బోగస్ సొసైటీలే ఉన్నాయని ఇరిగేషన్ అధికారులే చెబుతున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఇటువంటి బోగస్ సొసైటీలను గుర్తించి నివేదిక ఇవ్వాలని, వాటిని రద్దు చేయాలని ఆదేశించారు. మంగళవారం సాయంత్రానికి ఇరిగేషన్ అధికారులు బోగస్ సొసైటీల పేరిట నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం. రాజకీయ నేతల ఒత్తిడి వల్ల అనేక బోగస్ సొసైటీలకు అధికారులే అనుమతివ్వడం గమనార్హం. పైగా ర్యాంపులలో చోటు కూడా లేకపోయినప్పటికీ, ఎక్కువ సొసైటీలకు అనుమతి ఇవ్వడం వల్ల అసలు పడవలు లేనివాళ్లు కూడా సొసైటీల పేరిట అనుమతులు పొందారు. కొన్ని సొసైటీలు పనిచేయకపోయినా, వాటి పేర కూడా ఇసుక తీసినట్టు నమోదు చేస్తున్నట్టు సమాచారం. రాత్రి వేళల్లో డ్రెడ్జింగ్ చేసి అందరూ పంచుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని గాయత్రీ, కోటిలింగాల ర్యాంపులలో రాత్రుల వేళ్లలో డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఎలాంటి నిబంధనలూ వీరు పాటించడంలేదు. ఇష్టానుసారం ఇసుక దోపిడీ చేస్తున్నారు.

● కొవ్వూరులో ఘరానా దోపిడీ

కొవ్వూరు నుంచి వాడపల్లి వరకూ ర్యాంపులలో వందల సంఖ్యలో పడవలు ఉంటాయి. సుమారు ఇక్కడ 40సొసైటీలకు పైగా అనుమతి పొందినప్పటికీ, పదికంటే తక్కువ సొసైటీల పేరనే ఇక్కడ వ్యవహారం నడుస్తోంది. అసలు సొసైటీ అంటే ఉపాధి కోసం పనిచేసుకునే కార్మికులకు పని కల్పించడం కోసం ఏర్పడింది. ఇక్కడ ఒక్క కార్మికుడు కూడా ఉండరు. అధికార వర్గాలకు చెందిన కొందరు నేతలు ఇక్కడ దందా చేస్తుంటారు. ఏ పార్టీ ఉన్నా వీరి దందా ఆగదు. ఉచిత ఇసుక విధానానికి ఇక్కడ దారుణంగా తూట్లు పొడిచారు. ఇక్కడ కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. లారీకి అదనంగా రూ.6 వేల వరకూ వసూలు చేస్తున్నారు. రాత్రుల వేళ రోడ్డు కం రైలు బ్రిడ్జి మీద నుంచి కూడా రవాణా చేస్తున్నారు. ఇటీవల భారీ వాహనాలు వెళ్లకుండా ఇక్కడ గడ్డర్లు వేస్తే ఈ ఇసుక మాఫియా వాటిని ధ్వంసంచేసింది. విజ్జేశ్వరం నుంచి బ్యారేజి మీదుగా రావులపాలెం వైపు కూడా ఇసుక లారీలు వెళుతున్నాయి. బ్యారేజీ మీద నిషేధం ఉన్నా ఆపేవాళ్లే లేరు. కొవ్వూరు నుంచి కాకినాడకు 20 టన్నుల లారీకి రూ.28వేల వరకూ వసూలు చేస్తున్నారు.

● కడియపులంక ర్యాంపులో దోపిడీ

కడియపులంక ఇసుక ర్యాంపులో నిబంధనలు పాటించడం లేదు. నిలువు దోపిడీ చేస్తున్నారు. ఇక్కడ మొదటి టెండరుదారుడు అనర్హుడు కావడంతో రెండో టెండరుదారుకి అధికారులు అవకాశం ఇచ్చారు. దీనితో కోనసీమకు చెందిన ఒక వ్యక్తి పేరట రాత్రీ పగళ్లు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. మొదటి టెండరుదారు కోర్టుకెళ్లి స్టే తెచ్చినా సరే ఇక్కడ దోపిడీ ఆగడం లేదు. అధికారులూ పట్టించుకోవడం లేదు.

● ఎవరీ ఆర్కే..

ఇటీవల ఇసుక ర్యాంపులలో ఆర్కే అనే మాట బాగా వినిపిస్తోంది. మొత్తం బోట్స్‌మన్ సొసైటీలన్నీ అతడే మెయింటెనెన్స్ చేస్తున్నట్టు అందరి నోట వినిపిస్తోంది. ఇంతవరకూ ఈ ఆర్కే అనే వ్యక్తి ఇతర జిల్లాలకు చెందిన ఇసుక వ్యాపారి. ఒక కేసులో జైలు రిమాండ్‌లో కూడా ఉన్నారు. గత వైసీపీ ఆధ్వర్యంలో బోట్స్‌మన్ సొసైటీల పేరిట యథేచ్ఛగా ఇసుక డ్రెడ్జింగ్ చేసి వైసీపీ అధిష్ఠానానికి నెలకు రూ.కోట్లు కప్పం కట్టి, తానూ భారీగానే దోచుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అటువంటి వ్యక్తి కూటమి ప్రభుత్వంలో కూడా ఇసుక పెత్తనం చెలాయిస్తున్నాడు. మొత్తం అతని చేతిలోనే ఇసుక వ్యాపారం జరుగుతుండడం గమనార్హం. డబ్బు వ్యవహారాలు కూడా అతని చేతుల మీదుగానే సాగుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇసుక తీత తక్కువ వస్తున్నట్టు కూడా మతలబు మొదలెట్టారు. అసలు లెక్కల్లోకి రాకుండానే ఇసుక విక్రయాలు సాగిస్తున్నారు. ఈ బోట్స్‌మన్ సొసైటీ ర్యాంపుల పర్యవేక్షించవలసిన ఇరిగేషన్ అధికార్లకు కూడా ఇక్కడి లెక్కలు తెలియడం లేదనడం గమనార్హం. అంటే ఎంత ఇసుక దొంగచాటుగా వెళ్లిపోతుందో అర్థం చేసుకోవచ్చు. పైగా ఇసుక తీత తక్కువైందని ప్రచారం చేస్తున్నారు. కాగా బోట్స్‌మన్ సొసైటీలకు ఈనెలాఖరితో అనుమతులు ముగుస్తున్నాయి. దీంతో దోపిడీ మరింత పెరిగింది. రాత్రీపగలూ డ్రెడ్జింగ్ చేసి ఇసుక దోపిడీ చేస్తున్నారు. రూ.కోట్లు గడిస్తున్నారు.

● త్వరలో డ్రెడ్జింగ్‌కు అనుమతి

గతంలో డ్రెడ్జింగ్‌కు అనుమతి పొందిన రాఘవా కన్‌స్ట్రక్షన్ అసలు ఇసుక తీయకుండానే బిల్లులు కోసం ప్రయత్నం చేస్తున్న సంగతి తెలిసిందే. గతంలో ఆర్కే అనే వ్యక్తి వైసీపీ పెద్దల అండదండలతో చేసిన ఇసుక అక్రమ డ్రెడ్జింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఇక బోట్స్‌మన్ గడువు ముగియనుండడంతోపాటు రాఘవా కన్‌స్ట్రక్షన్‌కు ఇచ్చిన గడువు కూడా ముగియనుంది. దీంతో కొత్త ఏజన్సీతో మినీ మెకనైజ్ బోట్లతో డ్రెడ్జింగ్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ మేరకు టెండర్ల ప్రక్రియకు రంగం సిద్ధం చేస్తున్నారు. దీంతో గోదావరిలో వచ్చే నెల నుంచి డ్రెడ్జింగ్ మొదలు కావచ్చు. ఏ విధానంలో ఇసుక తీసినా, ఉచిత విధానానికి అనుకూలంగా లేకపోతే చెడ్డపేరు వస్తుంది. సీతానగరం మండలంలో వంగలపూడి ట్రాక్టర్లతో ఉచిత ఇసుకను తరలిస్తున్నారు. ఇక్కడ కూడా అవసరం ఉన్నవాళ్లు.. లేని వాళ్లూ, వ్యాపారులు కూడా ఇసుకను తరలించుకుపోతుండడం గమనార్హం.



బొమ్మూరులోని కలెక్టరేట్‌లో అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

శాశ్వత పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా అధికారులంతా పనిచేయాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పీజీఆర్ఎస్ నిర్వహణపై సమస్యల పరిష్కారాల రిపోర్టుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారంవారం సమీక్షిస్తున్నారని చెప్పారు. లాండ్ ఆర్డర్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి ఎక్కువ అర్జీలు రావడం జరుగుతోందన్నారు. అర్జీదారులకు శాశ్వత పరిష్కారాలు చూపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ప్రజల నుంచి 126 అర్జీలు స్వీకరించారు. వాటిలో ఆన్‌లైన్‌లో 125 ఆఫ్‌లైన్‌లో ఒకటి వచ్చాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

5న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు..

ఈనెల 5న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి జరిగే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికలపై అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు చాలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అలాగే డిసెంబర్ 5న జరిగే అన్ని గ్రామాల నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 23 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. 23 అర్జీలను స్వీకరించి అధికారులకు పంపించారు.



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పర్యాటకంగా కడియం అభివృద్ధి : కలెక్టర్

కడియం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కడియం నర్సరీలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేలా నర్సరీ ప్రతినిధులతో సంప్రదించడం, కార్యరూపం దాల్చడంపై సమన్వయ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో పర్యాటక, ఉద్యానవన, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ కడియం నర్సరీలను వివిధ రకాల అంశాలతో కూడిన రీతిలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. బోటింగ్, స్టాల్స్ జిప్ లాగ్, అడ్వంచర్ స్పోర్ట్స్ తదితర అంశాల సమ్మేళనంతో ఈ ప్రాంతం అభివృద్ధి చేయాల్సి ఉంటుందన్నారు. టూరిజం అభివృద్ధి వల్ల ఈ ప్రాంతానికి మంచి గుర్తింపుతోపాటు ఇక్కడి వారికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ తెలిపారు. స్టాల్స్ ప్రతిపాదన కోసం లేఅవుట్ సిద్ధం చేసి, కేటాయింపులపై ప్రణాళిక అందజేయాలని ఆదేశించారు. సౌందర్య వాస్తు శిల్పి ఎక్కువమంది సందర్శించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. కడియం ప్రాంతాన్ని శానిటేషన్‌పరంగా చక్కని నిర్వహణ వ్యవస్థ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ ఏ దుర్గేష్, జిల్లా పర్యాటక అధికారి పి వెంకటాచలం, పర్యాటకశాఖ మేనేజర్ సీహెచ్ పవన్‌కుమార్, డిప్యూటీ ఈఈ (పర్యాటక) జీఎస్‌వీవీ సత్యనారాయణ, సహాయ మేనేజర్ ఆర్ గంగరాజు, జిల్లా ఉద్యాన అధికారి బి సుజాతకుమారి, కడియం తహశీల్దారు కే పోశిబాబు, ఎంపీడీవో కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఆధార్ నమోదు, నవీకరణ కేంద్రం

జిల్లా అభివృద్ధి అధికారి వీణాదేవి

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వివిధ అర్జీలు అందజేసేందుకు వచ్చే ప్రజలకోసం ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్నట్టు జిల్లా అభివృద్ధి అధికారి పి. వీణాదేవి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఈ ఆధార్ కేంద్రం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 102 గ్రామ సచివాలయాల్లో ఆధార్ కిట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు సాంకేతిక నిపుణులను అందుబాటులో ఉంచి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని వీణాదేవి తెలిపారు. మండలాల వారీగా చాగల్లు 4, దేవరపల్లి 3, గోపాలపురం 3, కొవ్వూరు రూరల్ 5, కొవ్వూరు అర్బన్ 1, నల్లజర్ల 5, నిడదవోలు రూరల్ 4, నిడదవోలు అర్బన్ 1, పెరవలి 6, తాళ్లపూడి 3, ఉండ్రాజవరం 4, అనపర్తి 5, బిక్కవోలు 5, గోకవరం 4, కడియం 5, కోరుకొండ 5 రాజమహేంద్రవరం రూరల్ 7, రాజమహేంద్రవరం అర్బన్ 17, రాజానగరం 7, రంగంపేట 5, సీతానగరం మండలంలో 4 కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ సేవల్లో భాగంగా కొత్త ఆధార్ కార్డు నమోదు, బయోమెట్రిక్ నవీకరణ (వయస్సు 5-7 మరియూ 15-17) డిమోగ్రాఫిక్ అప్‌డేట్ (చిరునామా, ఫోన్ నంబరు మార్పు పేరులో తప్పులు) చేతివ్రేలు ముద్రల నవీకరణ, డాక్యుమెంట్ సవరణ వంటి సేవలు అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు.



అధికారులకు వినతిపత్రం అందిస్తున్న ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

‘సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళతాం’

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 9 నుంచి తామంతా సమ్మెలోకి వెళతామని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ స్పష్టంచేసింది. ఈమేరకు సోమవారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షుడు కోటాని ముకుందరామ్, గుద్దాటి నరసింహమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమాదుల యేసుబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుంగా యెషయారాజు, అధ్యక్షుడు సిరికి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పాలిక బాలభవాని కుమార్, ఉపాధ్యక్షుడు మందనక్క సాయిలు విలేకరులతో మాట్లాడారు. గత 25 ఏళ్ల ఔట్‌సోర్సింగ్‌లో చాలీచాలని వేతనాలతో కార్మికులంతా దుర్భరజీవితాలు గడుపుతున్నామన్నారు. టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా రెండు రకాలుగా మంచినీటి విభాగం, స్ట్రీట్‌లైట్ విభాగం, ఇండోర్ అవుట్‌డోర్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, గార్డీనర్లు, డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచాలని టెక్నికల్‌కు రూ. 29,200, నాన్‌టెక్నికల్‌కు రూ.24,500 ఇవ్వాలని, 15 ఏళ్లపైబడి కార్మికులను క్రమబద్ధీకరించాలని, విధుల్లో మరణించిన కార్మికుడికి రూ.10 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలని డిమాండు చేశారు.

జగన్ విధ్వంసం చేసి వెళ్లిపోయాడు

రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల



విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి ఆర్థిక విధ్వంసం చేసి వెళ్లిపోయాడని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో తననివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి చేసిన ద్రోహానికి, అన్యాయాలకు అక్రమాలకు ఉరిశిక్షే సరి అని వ్యాఖ్యానించారు. జగన్ గంజాయి, మత్తుమాదక ద్రవ్యాలను పెంచిపోషించాడని, అక్రమ మద్యంతో దోచుకున్నాడని ధ్వజమెత్తారు. పోలవరాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమే కాకుండా జగన్ వల్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిని వెయ్యి కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సివస్తోందన్నారు. శాశ్వతంగా అధికారంలోకి ఉంటానని ఊహల్లో ఉండి రూ.560 కోట్లు పెట్టి రుషి కొండపై ప్యాలెస్ కట్టుకున్నాడని ధ్వజమెత్తారు. గడచిన ఐదేళ్లలో నీటిపారుదలకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రూ.3వేల పింఛను పెంచడానికి ఐదేళ్ల సమయం తీసుకున్నాడని, తల్లిని చెల్లిని బయటకు గెంటేశాడని విమర్శించారు. ఆదాని కేసులో తన ప్రమేయం లేదని అంటున్న జగన్ అప్పుడు ఆయన సీఎం కాదా అని ప్రశ్నించారు. ఇంటర్నేషనల్ సంస్థ చర్యలు తీసుకోవడానికి తన పేరు లేదని జగన్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క వ్యవస్థ ప్రక్షాళన చేసుకుంటూ వస్తున్నామన్నారు. ఆర్థికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. అసైన్డ్ భూముల్లో లక్షలాది ఎకరాలను వైసీపీ దోచుకుందన్నారు. అన్ని లెక్కలు తేలుతాయన్నారు. జగన్‌ను చెప్పులు రాళ్లతో సత్కరించాలా అని ప్రశ్నించారు. అధికారం ఉందని గతంలో ప్రజలకు అందించాల్సిన బియ్యం వైసీపీ నేతలు విదేశాలకు తరలించేశారని.. సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లపై ఎవరు పోస్టులు పెట్టారో వారు శిక్ష అనుభవిస్తారన్నారు. ఈ సమావేశంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, కడియం టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, దాలిపర్తి వేమన తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి

కొవ్వూరు డివిజన్ అధికారులతో సమావేశంలో జాయింట్ కలెక్టర్ చినరాముడు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చినరాముడు

కొవ్వూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మార్గదర్శకాలను తూచా తప్పక పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై కొవ్వూరు డివిజన్ పరిదిధిలోని 9 మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద లోపలికి, బయటకు ప్రత్యేక మార్గాలు, బందోబస్తు, రిసెప్షన్ కేంద్రాల మ్యాప్ సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా రిటర్నింగ్ అధికారి పూర్తిస్థాయిలో అధికారం కలిగి ఉంటారన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు చెక్‌లిస్టు ప్రకారం అధికారులు, ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులు ధ్రువీకరణ పత్రాలు ముందుగా అందజేయాలన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 4వ తేదీ ఉదయం ఎన్నికల సామగ్రి పంపిణీ చేయనున్నామన్నారు. ఎస్ఎస్ఆర్-2025 ఓటరు జాబితా రూపకల్పన చేస్తున్న దృష్ట్యా యువ ఓటర్ల నమోదులో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఆర్డీవో రాణి సుస్మిత, తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన



కొవ్వూరులో స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌జేడీ శోభారాణి

కొవ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఎస్.శోభారాణి పరిశీలించినట్టు ప్రిన్సిపాల్ జె.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఆర్‌జేడీ శోభారాణి సోమవారం కొవ్వూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటయించిన స్థలాన్ని పరిశీలించినట్టు పేర్కొన్నారు.

ఛత్తీస్‌గఢ్ బీజేపీ నాయకుడికి సత్కారం



వేలివెన్నులో బీజేపీ నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజేపీ రాయపూర్ కోఆర్డినేటర్ రూప్‌నారాయణసిన్హా మండలంలోని వేలివెన్ను గ్రామంలోని బీజేపీ నాయకుడు శ్రీకాకుళపు ప్రసాద్ శర్మ ఇంటికి సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా నారాయణసిన్హాను, పార్టీ నాయకులను సత్కరించారు. నారాయణసిన్హా మాట్లాడుతూ శనివారం కొవ్వూరులో ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో లక్ష రుద్రపూజ, యాగాలు, కార్తీక వనసమారాధన నిర్వహించడం అభి నందనీయమన్నారు. కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ స్పెషల్ డ్యూటీ ఆఫీసర్(ఓఎస్‌డీ) తుల్సికౌశిక్, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు పాల్గొన్నారు.

పాఠశాలలకు సమగ్ర ప్రగతి పత్రాల పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు మొక్కలు అందిస్తున్న ఎంఈవో నెహ్రూజీ

తాళ్లపూడి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రగతిని నమోదు చేసేందుకు సమగ్ర ప్రగతి పత్రాలను విద్యార్థులకు పంపిణీ చేసేందుకు సోమవారం వేగేశ్వరపురం ఉన్నత పాఠశాల వద్ద మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరికీ ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీ అందజేశారు. ఈ ప్రగతి పత్రంలో విద్యార్థుల సమగ్ర సమాచారం ఉండేలా రూపొందించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. ఈ మొక్కలను మెగా పేరెంట్స్ డే రోజున హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులతో నాటించి వాటిని విద్యార్థులకు దత్తత ఇచ్చి వాటిని సంరక్షించేలా ప్రోత్సహించాలని హెచ్‌ఎంలకు ఎంఈవోలు సూచించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నిర్వాహకుడు, ముగ్గురు విటులపై కేసు

కొవ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యభిచారం గృహంపై దాడిచేసి నిర్వాహకుడు, ముగ్గురు విటులపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని సత్యవతినగర్‌లోని సాయి ఎన్‌క్లేవ్ లేఅవుట్ శివారున ఉన్న ఇంటిని రాజమహేంద్రవరం సీటీఆర్ఐకు చెందిన ఆటోడ్రైవర్ మద్దిపాటి నాగేశ్వరరావు అద్దెకు తీసుకున్నాడు. ఇద్దరు అమ్మాయిలను తీసుకొచ్చి విటులకు సమాచారం ఇచ్చి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో సోమవారం సాయంత్రం సిబ్బందితో సీఐ దాడి చేశారు. ఇద్దరు అమ్మాయిలను వ్యభిచారం గృహం నుంచి కాపాడి నిర్వాహకుడు నాగేశ్వరరావుతో పాటు రాజమహేంద్రవరానికి చెందిన ముగ్గురు విటులను అరెస్టు చేసి వారిపై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

సాగులో యాంత్రీకరణతో అధిక లాభాలు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో యాంత్రీకరణ పద్ధతులు అవలంబించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్‌డీన్ డి.శ్రీనివాస్ అన్నారు. రాజవోలు వ్యవసాయ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా యాంత్రీకరణ, ఎలుకల నివారణ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జీపీఎస్ గైడెడ్ ట్రాక్టర్ల నుంచి ఆటోమెటిక్ నీటిపారుదల వ్యవస్థల వరకు వ్యవసాయ యంత్రాలతో రైతులకు పురోగతి మరింత సమర్థవంతంగా, ఉత్పాదికంగా పనిచేయడంలో సహాయ పడుతుందన్నారు. అనంతరం ఎలుకల నివారణపై విషపు ఎర తయారు చేసే విధానాన్ని ప్రొఫెసర్ అనూష వివరించారు.

ఎక్స్‌ప్రెస్‌లను అనుమతించాలి



పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో సుస్మిత

▸ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి జయరాజు
▸ కొవ్వూరు టౌన్‌లోకి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సుల రాకపై ఆర్డీవోకు వినతి

కొవ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక, ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకపోవడంతో ప్రజలు దూర ప్రయాణాలకు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు అన్నారు. కొవ్వూరు పట్టణంలోకి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఆర్డీవో రాణి సుస్మితకు ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు కం రైలు బ్రిడ్జి భద్రత పేరుతో ఎక్స్‌ప్రెస్ బస్సులను అనుమతించక పోవడంతో పట్టణ ప్రజలు దూర ప్రయాణాలకు వెళ్లాలంటే తీవ్ర వ్యయ ప్రయాసలకు గురవుతున్నారన్నారు. విజయవాడ, విశాఖపట్నం నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్, హైటెక్ బస్సులు కొవ్వూరులోకి రాకుండా గామన్ వంతెన మీదుగా రాజమహేంద్రవరం వెళ్లిపోతున్నాయని, దీంతోప్రయాణికులు టోల్‌గేట్ వద్ద దిగి టౌన్‌లోకి రావడానికి అధికమొత్తం చెల్లించి ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. రాత్రుళ్లు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు, విద్యార్థినులు గామన్ వంతెన అండర్ టన్నెల్ వద్ద బస్సు ఎక్కడానికి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వంతెన నుంచి ఆర్టీసీకి చెందిన అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను పట్టణంలోకి అనుమతించాలని కోరారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ త్వరలో జరగనున్న డివిజనల్ సమావేశంలో అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సూరపనేని సోమయ్య తదితరులు ఉన్నారు.

పీజీఆర్ఎస్‌కు 3 ఫిర్యాదులు

కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించి, 3 ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదారునికి న్యాయం చేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చాగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆర్‌డీఎస్ఎస్ వర్కు నిమిత్తం మండలంలోని చంద్రవరంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎన్.నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

వ్యక్తిపై దాడికి పాల్పడిన
ఇద్దరిపై కేసు

కొవ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్‌ను ఓవర్‌టేక్ చేశాడని ఓ వ్యక్తిని బీరు బాటిల్‌తో కొట్టి గాయపర్చిన వ్యక్తులపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. చాగల్లు మండలం గౌరిపల్లికి చెందిన జాగు నాగశివ ఈ నెల 1న దాణా కొనుగోలు కోసం పశివేదల గ్రామం వెళ్లాడు. అక్కడ రైల్వేట్రాక్ సమీపంలో నాగశివ బైక్‌కు ముందు పశివేదలకు చెందిన నవీన్, వరుణ్‌లు బైక్‌పై వెళ్తున్నారు. నాగశివ హారన్ కొడుతూ ముందు వెళ్తున్న బైక్‌ను ఓవర్‌టేక్ చేశాడు. దీంతో నవీన్, వరుణ్.. శివ బైక్ ఆపి చెంపపై బీరు బాటిల్‌తో కొట్టి గాయపర్చారు. పశివేదల గ్రామం వచ్చేసరికి ఇద్దరితో పాటు మరికొందరు అక్కడికి వచ్చి శివను కొట్టి, బైక్‌ను లాక్కెళ్లారు. ఈ ఘటనపై నాగశివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నిర్మాణం పూర్తయిన ఇళ్లకు
విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి

సూరయ్యపేట మహిళల వినతి



తహశీల్దార్‌కు వినతిపత్రం అందించిన సూరయ్యపేట మహిళలు

తాళ్లపూడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో స్థలాలు పొంది నిర్మాణం పూర్తైన కాలనీల్లో ఇళ్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని అన్నదేవరపేట పరిధిలోని సూరయ్యపేట మహిళలు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ రవీంద్రనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. గత డిసెంబరు నెలలోనే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని విద్యుత్ కనెక్షన్ కోసం ఎదురు చూస్తున్నామని, కనెక్షన్లు ఇవ్వకపోవడంతో విద్యుత్ సిబ్బందిని సంప్రదించగా ఉచిత విద్యుత్ పథకం నిలిచిపోయిందని, కనెక్షన్‌కు రూ.6 వేల ఖర్చవుతుందని తెలిపినట్టు పేర్కొన్నారు. తామంతా పేదలమని, సంవత్సరం నుంచి చీకటిలోనే మగ్గుతున్నామని, ప్రభుత్వం స్పందించి ఉచిత కరెంటు కనెక్షన్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో దుర్గ, హైమావతి, వెంకటలక్ష్మి, పోసమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల ఆన్‌లైన్ 90శాతం పూర్తి



చాగల్లు పంచాయతీలో ఇంటి పన్నులు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

చాగల్లు, డిశంబరు 2(ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రి పేరుతో జరుగుతున్న ఇంటి పన్నుల ఆన్‌లైన్ ప్రక్రియ మండలంలో 90శాతం పూర్తయ్యింది. ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడం, ఇంటి యజమాని నేరుగా ఆన్‌లైన్‌లో ఇంటి పన్ను చెల్లించుకొనేలా చేయడం కోసం ప్రభుత్వం ఇంటి పన్నుల విధానాన్ని ఆన్‌లైన్ చేస్తున్నారు. మండలంలోని 13 పంచాయతీల పరిధిలో 15,995 ఇళ్లు ఉన్నాయి. వాటిలో చంద్రవరం, దారవరం, మల్లవరం, గౌరిపల్లి, నందిగంపాడు, నెలటూరు, ఎస్.ముప్పవరం, కలవలపల్లి, చిక్కాల పంచాయతీలు నూరు శాతం ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తిచేశాయి. మండల కేంద్రమైన చాగల్లులో 5,548 గృహాలు ఉండగా 90శాతం పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాల్లోను దాదాపు 90శాతం ఆన్‌లైన్ చేయగా మార్కొండపాడు మాత్రం బాగా వెనుకబడింది. ఆ గ్రామంలో సుమారు 60శాతం వరకు జరిగినట్టు చెబుతున్నారు. త్వరగా ఇంటి పన్నులు ఆన్‌లైన్ చేయడం కోసం ఎంపీడీవో ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారు.

డేటాను త్వరగా ఆన్‌లైన్ చేయాలి

ఉండ్రాజవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నుల డేటాను ఆన్‌లైన్‌లో త్వరగా నమోదు చేయాలని ఎంపీడీవో రామారావు పేర్కొన్నారు. సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. మండలంలో అన్ని పంచాయతీలు ప్రతి ఇంటి డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రెండు రోజుల్లో పూర్తి సమాచారాన్ని పొందుపర్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కెఎస్ఆర్ శర్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ
అప్రమత్తంగా ఉండాలి

దేవరపల్లి సీఐ నాయక్

గోపాలపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దేవరపల్లి సీఐ నాయక్ అన్నారు. సోమవారం సాయంత్రం గోపాలపురం మండలం వాదలకుంట గ్రామంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, సారా నివారణకు గ్రామస్థులు సహకరించాలన్నారు. సైబర్‌నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అపరిచితులెవరైనా ఉంటే తమకు తెలియజేయాలన్నారు. సారా తయారు చేసినా, అమ్మినా వారి వివరాలు తమకు తెలియజేయాలన్నారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. యువకులు చెడువ్యసనాలకు లోనుకాకుండా సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ఎస్ఐ సతీష్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తేమ శాతంతో సంబంధం లేకుండా
ధాన్యం కొనుగోలు చేయాలి

చాగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా కురుస్తున్న అకాల వర్షాలను, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పండించిన ధాన్యాన్ని తేమ శాతంతోసంబంధం లేకుండా తక్షణం కొనుగోలు చేయాలని రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇచ్చిన హామీ ప్రకారం 25శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్న మాటను నిలబెట్టుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గారపాటి సుబ్బారావు, బుద్ధుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో
గైట్ విద్యార్థి ప్రతిభ

రాజానగరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇటీవల నిర్వహించిన ఇంటర్ యూనివర్శిటీ యోగా పోటీల్లో తమ కళాశాల విద్యార్థి అంకిత్ దేబ్నాద్ వ్యక్తిగత విభాగంలో చక్కని ప్రతిభ కనబర్చి ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికైనట్టు గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ ధనరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మన టీడీపీ యాప్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తున్న నాయకులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అభినందించారు. సోమవారం పార్టీ స్థానిక కార్యాలయంలో మన టీడీపీ యాప్ యాక్టివ్ మెంబర్లు వేమగిరి వెంకట్రావు, కాట్రగడ్డ గౌతమ్‌లకు పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పంపిన ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కంటమణి రామకృష్ణారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోలింగేశ్వరస్వామికి మంత్రి దుర్గేష్ పూజలు



మంత్రి దుర్గేష్‌కు వేదాశీర్వాదం అందజేస్తున్న పండితులు

నిడదవోలు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో గోలింగేశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయార్చకులు, మేనేజర్ నామా సూర్యప్రకాశరావు స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో రంగా రమేష్, చెన్నవరపు రాజా, గ్రంధి బాలాజీ, నీలం రామారావు పాల్గొన్నారు.

కార్తీక మాసం ముగింపు ఉత్సవాలు



విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

దేవరపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పల్లంట్లలో రాజరాజేశ్వరి సమేత శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో విద్యార్థులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ చాగల్లు ఛైర్మన్ జేవీకే ప్రసాద్, ఏవీవీ సత్యనారాయణ, నలమాటి లలిత, మద్దిపాటి బిందు, కొయ్యలమూడి గీత, ఆచంట స్వాతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆరు ఇసుక లారీల సీజ్

కొవ్వూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అధికలోడుతో ఇసుక రవాణా చేస్తున్న ఆరు లారీలను సీజ్ చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరులోని రోడ్డు కం రైలు బ్రిడ్జి టోల్‌గేట్ వద్ద సోమవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న ఆరు లారీలు వాడపల్లి ర్యాంపు నుంచి 1, ఎరినమ్మ ఇసుక ర్యాంపు నుంచి వస్తున్న 5 లారీలను సీజ్‌చేసి తదుపరి చర్యల నిమిత్తం కొవ్వూరు మోటారు వేహికల్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించినట్టు సీఐ విశ్వం తెలిపారు.